# అక్షరాక్షతలు



894.8271
GNA

సురగాలి తిమోతి జ్ఞానానందము

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY

894.8271
GNA

AUTHOR : [illegible]

TITLE : అక్షరాక్షతలు

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

# అక్షరాక్షతలు

A

డా|| వి.ఆర్. నార్లగారికి

15-4-75

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10829

V.R. MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.
10829

కవికోకిల, కవితావిశారద, కవిలోకవిభూషణ

సాహితీవల్లభ, విద్వత్కవిచూడామణి,

**సురగాలి తిమోతిజ్ఞానానందము**

హక్కులు గ్రంథకర్తవి

B

ప్రథమముద్రణము
1973 ఆగస్టు

T
894.8271
GNA

ఖరీదు :
మూడు రూపాయలు

D. P. R. L.
Acc. No.

ముద్రణ :
శ్రీపతి ప్రెస్,
కాకినాడ.

A0UA105B 139

శ్రీ కంటిపూడి వంశసు
ధాకరుడు గుణాలయుడు నుదారుడు సుజన
శ్లోకుడు రసికోత్తంసుడు
నా కావ్యవధూటి కెనయ నాథుం డయ్యెన్.

D

[illegible] (೮)

[illegible]

[illegible]

[illegible]

# గుండెలోని గుసగుసలు

"మీా రెప్పుడింతేనండి" "అంతనిరంకుశత్వం పనికి రాదు" అనుచు ఆపసోపాలు పడుచు ద్విచక్రచలన శకటము పైనుండి దిగినారు శ్రీపాత్రుడు. నా సహజధోరణిలో "ఏమటండీ కథాకమామీాషు" అని అన్నాను, "మీారు వెంటనే కనకాభిషేకముపై పద్యాలు వ్రాయా" లన్నారు. నిమిషాలమీాద పనిజరిగితీరవలసిందేనని మంకుపట్టు పట్టినారు. కనకాభిషేకముపై నేను పద్యాలు వ్రాయాలి నిజమే. ఆ అభిషేక మెవరికి? ఎప్పుడు? అని నేనడుగగా పాత్రుడు గారు సమస్తమును పూసగ్రుచ్చినట్లుగా వివరించినారు. శ్రీ పాత్రుడు నా యాప్తమిత్రసాహితీబాంధవులలో నొక్కరు. పాత్రుడుగారిని కూరుచోబెట్టి యొకయరగంటలో నవరత్న పద్యములు వ్రాసితిని. వెంటనే నన్ను రామదాసు మోటారు ట్రాన్సుపోర్టు కంపెనీకి తీసికొనివెళ్ళి శ్రీ మంథా నరసింహ మూర్తి (నల్లపంతులు) శ్రీ వి. యస్. రాజు (కార్యదర్శి) గార్లను పరిచయము గావించినారు. వారు నారచన విన్నారు. ఇంతకుముందెప్పుడో నాగూర్చి వినినవారే; సంబరపడినారు. సంభావన మొసంగినారు. ఇది నేననుకొనని విచిత్రసంఘటన. తరువాత పాత్రుడుగారు కళారిరంసామతులైన శ్రీ చౌదరి గారి దర్శనము చేయించినారు. శ్రీ చౌదరిమహాశయులు

నా పద్యాలు విన్నారు. ఆనందపరవశులైనారు. అయిదువేల పత్రములను అచ్చువేయించమని యనుజ్ఞ నొసంగినారు. కన కాభిషేక మహాపర్వదిన సభామధ్యములో నాచే పఠింపజేసి సముచిత సమున్నతరీతుల సత్కారాలను గావించినారు. శ్రీ చౌదరిగారితో నాకదే ప్రథమపరిచయము. వారి సరళ స్వభావము విశాల దాతృతాగరిమము నింతకుముందే విన్నాను. వారికొక కృతినీయవలెనను సంకల్ప మానాడే నాకు కలిగినది. ఆశావాదినై యెదురుచూచితిని. ఒకనాడు వారిదరిసెనము చేసితిని. నాయెదలోని భావమును విస్పష్ట ముగా విన్నవించితిని. వారు వెనుదీయని మానసముతో హాసవదనముతో "అలాగే కానియ్యండి" అన్నారు. వారి సౌజన్యహృదయమునకు ముగ్ధుడ నయితిని. గుండెలో బండెడు గిడిగి శ్ఛర్పించుకొన్నాను. ఈ "అక్షరాక్షతలు" కృతిగా నిచ్చుచున్నాను.

కవులు పుట్టుదురు. చేయబడరు. శయ్యాసౌభాగ్య నైగనిగ్యము సహజముగా రావలసినదే కాని భాషా సామగ్రిమాత్రము పరిశ్రమించి సాధింపవలసినదే.

'సాధ్యోహి రసో యథాతథం కవిభిః'

"........మహాకవితావివేచ నా
భ్యాస మనంగ నంత బయిపైబడియున్నదె? యద్దియున్ జను
ర్వ్యాసనమేసుడీ! యదియు వారలు వారలు చేయుభాగ్యముం
జేసి లభించు;"

అని అన్నారు శ్రీతిరుపతి వేంకటకవులు గద్వాలలో తమయవధానోపన్యాస వేళలో. రసజ్ఞపత్రికలో కానరు నా కయిత యింపు కలిగించినచో కృతార్థుడను.

తెలుగు దేశమునలుమూలలనుండి నన్నెఱుగని భాషా బంధువు లెందఱో నారచనల పఠించి తమయానందమును వెల్లడించుచు నేటికిని నాకు లేఖలు వ్రాయుచునే యున్నారు. ఇది నా అదృష్టము.

ఎన్నో రచన లచ్చయినవి. ఇంకెన్నో యచ్చు కావలసి యున్నవి.

"శ్రేయాంసి బహువిఘ్నాని"

తెలుగునాడులో ప్రఖ్యాతిగన్న డా॥ బెజవాడ గోపాలరెడ్డిగారు, డా॥ నీలము సంజీవరెడ్డిగారు, డా॥ అయ్యదేవర కాళేశ్వరరావుపంతులుగారు, డా॥ శ్రీబలుసు ప్రభాకర పట్టాభిరామారావుగారు, శ్రీ బి. ప్రతాపరెడ్డిగారు, శ్రీ మంతెన సుబ్బరాజుగారు, శ్రీ యల్. మాలకొండయ్య గారు, శ్రీ దామోదరం సంజీవయ్యగారు, డా॥ త్రిపురనేని వేంకటేశ్వరరావుగారు ప్రభృతులకు నా కావ్యము లంకిత మొనర్చితిని. ఆకోవకుచెందినవారగు శ్రీ కంటిపూడి వీరరాజు చౌదరిగారికీ "అ క్ష రా క్ష త లు" అంకిత మిచ్చుట నాయదృష్టముగా తలంచుచున్నాను.

ఈ కావ్యములోని ఖండికల నప్పుడపుడు నాయాసన్ని వేశాలకు మనసు కరగినవాడనై వ్రాసినవే. ఇందులో కొన్ని ఖండికలు నభోగీర్జలజాయుతాక్షి ద్వారమున ప్రసారము చేయబడినట్టివే;

నా సర్వవ్యాసంగములకు సంపూర్ణసహకార మిచ్చు చున్న నా సహధర్మిణి మెటిల్డాసుగుణమణికి నా అభినందన ములు.

ఆఖరుగా అద్యతనాంధ్రకవిప్రపంచనిర్మాతలు మొగల్ తుర్తి రాజుగారికి చేసిన విన్నపమే నా విన్నపముగా శ్రీ చౌదరిగారికి చేసికొనుట యప్రస్తుతము గాదనుకొందును.


"కవితాకన్యక లెందఱేనిఁ గల రీకాలమ్మునం దల్లవా
రు విచారింపఁగ గ్రుడ్డికన్నుగలవారో కుంటివారో సురూ
పవిహీనాత్మలో కాగలారు వివరింపన్; సర్వసంపన్నమా
కవితాకన్య" యటంచునొక్క పలుకంగా నేల? మీ పోల్కనున్.

1-8-73, }
కాకినాడ. }

జ్ఞానానందము

✻

2



తాండవంబాడు ప్రోద్యన్మహాదీప్తిమై
రమణమౌ వదనాన రాజసమ్ము

# కృతిపతివంశాభివర్ణనము

ఘనతంగాంచిన కంటిపూడికులజుల్ గాంధేయవాదుల్ క్షమా
గుణసంపన్నులు దీనబాంధవులు తెల్గుల్ మెచ్చుకొన్నట్టి యా
రని కీర్తి ప్రతిభాసరిత్పతులు లొల్లగ్రామవాస్తవ్యు లం
దున పేరొందెను సీమరాజు కడుధన్యుండై ప్రజామోదియై.

శ్రీ సీమరాజుగారికి
భాసిలు వేఱొక్క పేరు పాపయ యనగా
శ్రీసుఖసముపేతుం డయి
వాసిం జెన్నారు ప్రజలప్రణుతుల గొనుచున్.

దత్తునిగ వహించె దలప నారాయణ
మూర్తిని హృదయమ్ము పొంగిపోవ
నెలమి కంటిపూడి యింటిపే ర్గలవాని
చిన్నవాని నంత సీమరాజు.

గారాలబిడ్డ డగు శ్రీ
నారాయణమూర్తిగారు నలువురిలోనన్
పేరొంది వంశగౌరవ
చారిత్రము నిలుపుకొనె ప్రజాహృదు లుబ్బన్.

సతతమ్ము దైవపూజాపురస్కారచిం
తనభావమె యెడంద తగులుకొనగ
నిఖిలపేదజనముల బరువైనస్థితి గాంచి
కరుణార్ద్రభావమ్ము కడలుకొనగ
పదిమంది సుకముగా బ్రదుకంగవలె నన్న
విశ్వధర్మము హృది పిచ్చలింప
మంచి కెల్లప్పుడు మరణమే లేదన్న
సత్యవాక్యము మనసార నమ్మి
అనుదినమ్మును దైవభావనమునందు
మనసు నిలుపు స్త్రీజనశిరోమణి యనదగు
సుబ్బమాంబను పెండ్లాడె శుభ్రచరితు
డైన సూర్యనారాయణాఖ్యామహితుడు.

ఆ దంపతులకు మేలిమి
గాదిలికొడు కుదయమయ్యె! కడలికి ఘనచం
ద్రోదయముంబలె ధాత్రిని
చౌదరివీర్రాజు సుగుణసంపన్నుండై.

తా నేకైకకుమారుడౌటను మహాద్భాగ్యమ్ము లోక్షమ్మడిన్
సానందమ్మున గేహమందు నయనాట్యం బాడినన్ చౌదరీ
శానుం డెప్డు వివేకవిజ్ఞతల ప్రస్థానించె మేల్ రథ్యలో
ఆనా డబ్బిన దొడ్డపద్ధతులు నే డాదర్శమై వెల్గెడిన్.

ప్రవిమలవిద్యావైదుషి
ప్రవితతకృషి సలిపి నేరు పందెను మిపులన్
నవభారతగురుకులమున
స్తవనీయుఁడు వీరరాజుచౌదరి ధృతిమై.

తన్నీరు బుల్లెయాఖ్యుని
మన్ననలం బడసి దుష్టమార్గము జనకే
పన్నీరువంటి విద్యల
నన్నింటిని నేర్చుకొనియె నతులగుణుండై.

ఎదుగుచున్నకొలంది నెదలోన మానవ
త్వపువిలువలమంచితన మెఱింగి
చదువుచున్నకొలంది శాస్త్రాలయందలి
వైవిధ్యభావాలపస యెఱింగి
చూచుచున్నకొలంది సుకవితామూర్తుల
రచనావిశేషాలరమణ మెఱిగి
తలచుచున్నకొలంది నిలువెల్ల పొలుపైన
జాతీయసమతాప్రశక్తి నెఱిగి

వాస్తవమ్మునకును పట్టాభిషేకమ్ము
సలుపు కంటిపూడికులజు డయిన
విశ్వమానవుండు వీర్రాజుచౌదరి
తేటమనసు గలుగు తెలుగువాడు.

తనవి వేకమ్ము నవశక్తి యనుగమింప
యినుమడించినయుత్సాహమున పరిశ్ర
మముల నభ్యుదయమ్మునై కొమరుమీఱ
నలుపుచున్నాడు వీర్రాజుచౌదరి పస.

భాగస్వాములు నైనమిత్రులను సంభావింపగా గొప్పయూ
రేగింపుల్ జరిపెన్ మహోత్సుకతతో నెంతో వ్యయించెన్ మతి
శ్రీగీయమ్ముగ పండితోత్తములకిచ్చె న్నాలువాల్ ధోవతుల్
శ్రీ గుప్పెన్ కనకాభిషేక మొనరించెన్ పేర్మి మిత్రాళికిన్.

వేలకొలందిసభ్యులు పవిత్రమహాసభ గాంచగా 'నిజా
మాలిని' తొంబదేండ్లుగల మానవమూర్తిని పిల్వబంచి యు
త్తాలసగౌరవమ్మునకు దర్శితమౌ కనకాభిషేకపుస్
బూలను జల్లజేసె పరిఫుల్లహృదబ్జుడు చౌద రెంతయున్.

చెప్ప నొకయధిపుడె 'శ్రీరామదాసుమో
టారుట్రాన్సుపోర్టు' చారుచరిత
వెలయుకంపెనీకి వీర్రాజుచౌదరి
మంచి యన్న పేరు మఱచువాడు.

'గోపాలాటోసర్వీస్'
స్థాపించి యశేషశ్రమికజనులకు బ్రతుకున్
జూపించె కంటిపూడి ని
శాపతి శ్రీవీరరాజు చౌదరి మెలమిన్.

అట్టిమహాగుణాఢ్యునకు నాదర మొప్పగ సాహితీకళా
ఘట్టములన్ సుధాకవనగాంగతరంగములన్ లసద్యశో
ధట్టము 'లక్షరాక్షతల' తద్దయు రమ్యమునైన కావ్యపున్
పట్టిని నిచ్చినాడ ననుబంధము పెంపగునట్లు ధాత్రిలో.

ఇచ్చెనా తలపులో నిట్టె వచ్చినతోడ
ఎవ రూహసేయుదు రేన్గుపాడి
నచ్చెనా మనసులో నడయాడుచో హీను
నైనను తనయంతవాని జేయు
మెచ్చెనా యెదలోన మేరు వడ్డంబైన
ఎదిరించి పేల్సేసి ముదము గూర్చు
చొచ్చెనా యది యెంత రచ్చకెక్కినకార్య
మయిన సాధించి విజయము గొనును

ఠీవి గల్గినట్టి కే. వి. ఆర్. చౌదరి
నాదుకావ్యకన్యనాథు డయ్యె
జంకు గొంకు లేక ఢంకా బజాయించి
వ్రాసికొందు కావ్యరాజములను.

సీతారత్నము వనితా
జాతములో పేరుగొన్న సద్గుణరాశిన్
ఆతతపేర్మిన్ చౌదరి
ప్రీతిం బరిణయము నాడె విశ్వము మెచ్చన్.

పూర్వమహిళామణులదారి బోవు, పేద
సాదలను దయతోడ సమాదరించు
ధర్మమున కెప్పుడును దెబ్బ తగులనీని
అమృతహృదయ సీతారత్నమాంబ సాధ్వి.

సిరి యింటన్ జరియించినన్ బుధులతో స్నేహమ్ము గావించినన్
దొరలన్నేరను పొల్లువా క్కొకటి యెందుం జూచినన్ చౌదరీ
శ్వరుజిహ్వాంచలసీమనుండి ఘనుడై సత్యమ్ము పాలించు సుం
దరుడౌ వానికి కంటిపూడికులజున్ దర్శించు సౌభాగ్యముల్.

అనిపించు సాహసం బైనధైర్యశ్రీల
   అచ్చమ్ము మేరుశిలోచ్చయమ్ము
అగుపించు నెపుడు దయాధర్మకార్యాల
   దానరాధేయునితమ్ము డగుచు
రహియించు కార్యనిర్వహణదీక్షాబుద్ధి
   కటివేల్పుమఱదికి గుఱుతు గాగ
వహియించు నెట్టిసభాపర్వ మైనను
   కృష్ణసారథ్యమ్ము గ్రేణి సేయ

విశ్వలోకహితుడు పీట్రాజుచౌదరి
కడిది గాంధిజాడ నడుచుచుండు
లలితకళలటన్న కులికి యాలంబన
మిచ్చు మంచి యన్న మెచ్చుకొనును.

ఇంపుగ 'యస్సారెమ్కో'
కంపెని యభివృద్ధికి కృషి గావించిన ధీ
లంపటుడు కళామతి యను
కంపయు గలవానికి కృతికన్య నొసగితిన్.

తాండవం బాడు ప్రోద్యన్మహాదీప్తిమై
రమణమౌ వదనాన రాజసమ్ము
మిట్టాడు నెల్లప్పు డిట్టె వర్తనమందు
నాణ్యమైనట్టి హుందాతనమ్ము
తొనకాడు తలప భావణ మాడుసమయాన
తగినవిధాన సుధాఛలోక్తి
కదలాడు దానంపుకార్యాల కెవ్వేళ
పరువుమీాఱిన హస్తపంకజమ్ము

కంటిపూడివంశఘనుడు శ్రీవీఱ్రాజు
చౌదరి కివి సహజసద్గుణాలు
సద్గుణాలు కలుగు చౌదరిగారికి
కమ్రయశము కలుగుగాక వసుధ.

కాకినాడ,
16-6-73.

గ్రంథకర్త:
జ్ఞానానందము.

*

# వి ష య సూ చి క


| | | పుట |
|---|---|---|
| దీక్షాగానము | ... | 1 |
| కృతజ్ఞతాంజలి | ... | 12 |
| బుల్లెయ్య | ... | 16 |
| పరీధావి | ... | 24 |
| స్వాతంత్ర్యరజతోత్సవ కవితాసందేశము | ... | 34 |
| అభినందనము | ... | 38 |
| దుద్దులు | ... | 44 |
| స్వేచ్ఛాగీతము | ... | 48 |
| వేమన | ... | 53 |
| రామానుజాచార్యులు | ... | 59 |
| తుంటరి | ... | 62 |
| ఆంజనేయా ! | ... | 65 |
| శరద్వేళ | ... | 70 |
| గోరా | ... | 71 |
| అంకితము | ... | 76 |
| లెనిన్ | ... | 78 |
| స్మృతి | ... | 79 |

2

# దీక్షాగానము

ధర్మచక్రహితుడు బంగ్లాబంధుముజిబురు
    ప్రాణాలతో బైటపడినదాక
నరులనెత్తురు జుర్రు పరమఘాతకుడు యా
    హ్యాఖానుతల ప్రక్క లైనదాక
భారతీయుని దయాభావసంపదలను
    అమెరికా కని సిగ్గు నందుదాక
కరుడుగట్టిన దురాపరులు చైనీయుల
    సామ్రాజ్యదాహమ్ము సమయుదాక

హిమధరాధ్రశృంగ మేపారుగౌరవ
ప్రతిభ గలుగునట్టి భారతీయ
జీవశక్తి సర్వభూవలయము దాకు
వణకు వలదు నిదుర భరతవీర !

## అ క్ష రా క్ష త లు

పరులం బ్రోచెడుధర్మబుద్ధికిని యావల్లోక మానందసా
గరడోలాళుల నూగిపోయినది నిక్కం బిద్ది నీదేశస
చ్చరితల్ జాటు పురాతనప్రతిభ యీస్వాతంత్ర్యవేళాపుర
స్సరభాగ్యమ్ముల దిద్దుకోవలయు విశ్వంబందు హిందూసుతా!

నిలువ న్నీడయు లేక ప్రాణములతో నీదేశమున్ జొచ్చి నీ
చలువైనట్టి కృపాదృగంచలప్రశస్తశ్రీలకుం జొక్క ప
స్తులు లేకుండగనున్నయట్టి శరణార్థుల్ నీమహౌదార్యపున్
తలపున్ మెత్తురు విశ్వవిశ్వములు నన్నా! నిన్ను నగ్గించెడిన్.

ధ్వజ మెత్తి ఘనసోషలిజముబాటను బోవు
ఇందిరమ్మ జయమ్ము హిందువలకు
చరఖామునీంద్రుని శాంత్యహింసాజ్యోతి
అష్టదిక్కులయందు నలరువలకు
భువనభాండముమెప్పు బొందు జవహరులాలు
పంచశీలవ్రతమ్ము మించువలకు
పొట్టిబహ్దారుశాస్త్రి కట్టినట్టిసమైక్య
భావమ్ము దేశాన ప్రబలువలకు

విశ్వతోముఖాన వృద్ధిగాంచిన దేశ
బహుళపథకరాశి వఱలువఱకు
లక్ష్యసిద్ధిలోన లవలేశ మైనను
పట్టు విడువరాదు భరతవీర !

తుంటరిగాండ్రనేతలు నెదోయొకరీతిని దేశభాగ్యపున్
బంటను నైక్యభావమును బ్రద్దలుసేయుటకే తలంతు రీ
కుంటెనకాండ్రయూహలను గోతులుత్రవ్వెడు వీరిదుష్టపున్
గంటకచేష్టలన్ దునుమ కగ్గము బట్టు మనుంగుసోదరా !

స్వాతంత్ర్యార్థము జీవితాలను తృణప్రాయమ్ముగా నెంచి లో
కాతీతం బగుత్యాగమున్ సలిపినారయ్యా ! బ్రిటీష్ భూపులే
భీతింజెందగ భక్తు ల, స్టిప్రుడు లోపించెన్ యథార్థంబుగన్
ఆలీరుల్ మఱి తెన్నులున్ భరతవీరా ! లేర ! స్థాపించరా !

గోచిపాతయు లేక గోసాయి యుల పార్ల
మెంటరీచట్టమున్ గెంటునాడు
కాషాయధారి జగద్గురుం డనువాడు
కుల మున్న దనుచు వాగోనిననాడు

సీమలో చదివి వచ్చిననల్లదొరగారు
అస్పృశ్యతకు భయ మందునాడు
గాంధీయవాదిగా గన్పించుబత్తుండు
ఆకతాయిగ తిరుగాడునాడు

కలదె? లోకోత్తరులు, మహాత్ములు వచించి
యాచరించిన మహనీయ మైనక్రియల
కొక్క ఫలితమ్ము భరతసహోదరుండ!
అమ్మ సుఖియింప నీదె భారమ్ముసుమ్ము!

కునుకుందీసినస్వార్థభూతముల యుక్కుందంష్ట్రికల్ కాలపున్
గోనబున్ దన్నున కూడిపోయినవి పెక్కుల్ నేడు మాయిందిరా
మణిదృగ్లీలలకూడి పోయెడిని సమ్యగ్జీవనం బబ్బెడిన్
అణుమాత్రమ్మనుమానమందవల దన్నా! ఆమెరాజ్యంబులో

ఎవనికివాడె మంచితన మెంచి చరించి యథోచితంబుగా
దివసము లూడ్చి పేదలకు దిక్కగునో యతడే జోహారు లం
దవలసియుండు తక్కొరులు దానికి నర్హులుగారు దేశమం
దివి నశియించె మేలుకొనుమీ! భరతాంబకు కీడు తేకుమీ!

## దీ క్షా గా న ము

నిరసింపవలయు గుండెలుదీయు రాష్ట్రాల
సరిహద్దువివాద జటిలసరణి
గర్హింపవలయు ధిక్కారమ్ము సేసెడు
ససుత లేనట్టిభాషావిధమ్ము

దండింపవలయు వార్ధాపహానినామమ్ము
పాడుచేసిన యెట్టివానినైన
నిందింపవలయు పనికిమాలినట్టి సా
హిత్యమ్ము సృష్టించుహీనకవిని

మాతృదేశమహితమర్యాదప్రగతికి
దెబ్బగొట్టజూచు త్రిమ్మరులకు
బుద్ధి చెప్ప దీక్ష బూనుము నేడైన
వజ్రనిభృతవీర ! భరతవీర !

*

# కృతజ్ఞతాంజలి

ఇదియేదోయొకమాయదారి తనసంతృప్త్యర్థమై సల్ప యే
బదివర్షమ్ములు నన్ను జుట్టుచు జరాభారమ్ములో దింపె శా
రద! నీదివ్యమహైకభూరికరుణార్ద్ర శ్రీకటాక్షమ్ము నా
కొదవంజాలినచో గృతార్థుడను నాకో చాలు నీకై తలుఁ.

నాజిహ్వాంచలసీమభాగమున పుణ్యంబైన నీపాదనీ
రేజమ్ముల్ స్పృశియింప రమ్యకవితల్ సృష్టింతు వాణీ! భవ
త్తేజస్సారములోని యొక్క కణ మెంతేనిచ్చి నాసాహితీ
పూజాభాజనదివ్యదార్చనము గొమ్మో వాక్కళాదేవతా!

దిగులుం జెందిన నాసరస్వతికి నుత్తేజమ్ము గల్పించి నా
యుగచాట్లుం గని సంతసమ్మిడిన విద్యామూర్తి సాహిత్యని
మ్నగలం దేలినమండలాధిపునకున్ మాన్యప్రశంసాంజలుల్
అగుతన్ దివ్యవిశుద్ధభావునకు శ్రీ యల్. మాలకొండయ్యకున్.

# కృతజ్ఞతాంజలి

సరదాకోసముగాదు శారదకు నీసమ్మేళనా లన్నచో
అరుదైపోయిన తెల్గుసాహితికి నయ్యా ! నీసుధాహస్తపున్
పరమంబైన బహూకరించుటలు నుద్భాసించు శ్రీకృష్ణరాట్
ధరణీనాథులు మాలకొండయ ! మహోద్యద్దివ్యభావోదయా !

వాగర్థప్రతిభాప్రశస్తనిభృతప్రాగ్భారసౌందర్యరే
ఖాగాంభీర్యమహత్తులో, కలుగుపొంకమ్ముల్ సమీక్షించి యా
బాగోగుల్ గమనించి మెచ్చుకొను విద్వన్మూర్తికిన్ ప్రాంజలుల్
శ్రీగుజ్జాలకులైకభూషణునకున్ శ్రీరామకృష్ణయ్యకున్.

నీయధ్యక్షతసాగుచున్నసభకున్ నిండైనపూజార్హతా
శ్రేయోవైభవముల్ ఘటిల్లెడిని ధాత్రీనాథు లీనాడు లే
రీయౌన్నత్యకళాప్రపోషణము చేయింపన్ ప్రజాసేవనా
ధ్యేయుల్ నీయటువంటివారి కగుగాదే ! రామకృష్ణాభిధా !

కమనీయంబగు నీసుధామధురవాగ్ధారాప్రవాహోర్మిలో
తమిదీరన్ జనముల్ మునింగిన మహోదాత్తప్రథాఘట్టముల్
చెమరించున్ హృదయాల సంతతము శ్రీ శ్రీభావ్యవంశాబ్ధిచం
ద్రమ ! విద్యానిధి ! నీకునయ్యెడిని నిస్తంద్రప్రభాభాగ్యముల్.

# అ క్ష రా క్ష త లు

నామహితప్రశస్తకవనమ్ములను గాంచి ముదమ్మువడ్డ ధీ
గ్రామణి ! సాధుభావనవిరాజితు డాంధ్రసరస్వతీప్రపూ
జామహదాశయోన్నతుడు సౌమ్యుడు సిద్ధముశెట్టి వేంకట
స్వామికి తూమెడంజలుల సల్పెద నీకవితావసుంధరన్.

రాజుల్ పూర్వము సత్కళారమకు పూరాగాసహాయమ్ములు
తేజంబొందగ జేసినా రనెడిసూక్తి శ్రీలు చెల్వారు నీ
రోజుంగూడ నిజమ్ము చెప్పికొనగా రూపాయలన్ సాహితీ
పూజార్థ మ్మిడుసుబ్బరాజునకు ముప్పొద్దుల్ సుఖాలయ్యెడిన్.

కార్యోత్సాహివి సత్కళాసతికి సింగారమ్ము గల్పించు నీ
ధైర్యశ్రీలను మెచ్చుకొందురు మహోత్సాహాన ధీమంతు లీ
వార్యుల్ పోయినబాటలో చనెదవయ్యా ? యెప్పు డేకాంబరా
చార్యా ! నీ కగుగాక విశ్వమున శశ్వద్దివ్యదైశ్వర్యముల్.

ఉత్తయమాయకుంబలె నహో ! కనిపింతువు చెప్ప నీమదో
న్మత్తజగాన కెల్లపుడు మందులు రాజ్యముసేయువేళ నీ
సత్తికి జోటులేదు సడిసన్న ప్రతిజ్ఞకు తావులేదయా !
బత్తులరామరాయ ! బహుభంగుల వర్ధిలుమయ్య ! శాస్త్రస్థలిన్.

# కృ త జ్ఞ తాం జ లి

ఆర్షమతమ్ముపట్ల గలయట్టిమహత్తరగాఢభక్తికిన్
శీర్షము నీప్రవర్తనము నిర్మలకర్మలమూర్తి ! వర్మ ! కా
మర్షికులైకవజ్రమ ! సమంచితమై తనరారు నీకళా
కర్షణకున్ శుభమ్ము లగుగాక ! యఖండకళాజగత్తులో.

గానాలాన్వయవార్ధిచందిరుడు పశ్కా దేశభక్తుండు సం
ప్రీణౌజ్జ్వల్యకళావిదుండు కవితావిద్యాపయోరాశిలో
తానంబాడిన దీనబాంధవుడు రాధాకృష్ణయాభిఖ్యు డ
క్షీణైశ్వర్యములోచెలంగుత యశశ్శ్రీ లెప్డు వెన్నాడగన్.

సముదగ్రప్రతిభావిశేషము లసత్సాహిత్యసాహిత్యసం
క్రమణంబుల్ గల నీవు నాకవితకున్ రాణింపు గూర్పంగ దు
ర్గమమా నేటిసభామహాస్సునకు ప్రోగ్రామమ్ము గల్పించు పా
శము నారాయణ ! నీకునయ్యెడిది నాసాహిత్యపూజాంజలుల్.

కవితాలోకములోన నీకుగలప్రఖ్యాతిన్ బ్రశంసింతు నీ
కవనమ్మందున గల్గుధాటికి జనుల్ కైవారముల్ సేతు రీ
భువిలో నీకు ననంతభాగ్యతతు లబ్బుంగాక ! మారెళ్ల కే
శవరాయా ! బుధగేయ ! సన్నుతకళాసౌజన్యభావోదయా !

# అక్షరాక్షతలు

హృదయవీణ మీటి యెసలేని తెలుగులో
తేనె లూరుకవిత దించినావు
చోడగిరివతంస ! శుభ్రమానస ! నీకు
చందరయ్య యగుత వందనాలు.

ఈ పాడైనప్రపంచనాగరకతా హేరాళమాధ్యమ్ముల్లో
రూపాయల్ నిలయాలుకట్టుకొని యారోపించు దౌర్జన్యకే
లీపాపౌఘము సత్కవీశ్వరులకున్ లేదింతస్థానమ్ము నే
జూపింతున్ రచనాచమత్కృతుల ప్రస్ఫోటించు సాహిత్యమున్.

ఎన్నటికైన తమ్ముని యహీనవచఃకవితావధూటి పే
రెన్నికగాంచునంచని యుదేపనిగా తలపోసి కష్టమం
దున్నపు డయ్యవోలె కరుణోన్నతి జూపినదొడ్డవాడు మా
యన్నకు శ్రీఫిలిప్పునకు నౌత యనేకములౌనమస్కృతుల్.

సుందరశారదాపదరజోలవలేశము నన్ స్పృశింప నీ
యందముచందముల్ గలుగునట్టి మహోన్నతసత్కవిత్వపున్
గందము లుప్పతిల్లురచనల్ పచరించితి సాహితీకళా
బంధువులార ! మీ కమరు భవ్యమహోజ్జ్వలదివ్యసౌఖ్యముల్.

# కృతజ్ఞతాంజలి.

ఎదుటన్మెచ్చి పరోక్షమందు చెడుగుల్ సృష్టించుమూఢాత్ములన్
మది గర్హింతును శారదాసతిని సంభావించువారిన్ యథా
విధిగా గౌరవ మాచరించెదను పృథ్వీభాగమం దెప్పుడున్
ఇది నానిశ్చయ మేమికావలెను నా కీనాడు ప్రశ్నింపగన్.

ముప్పదియైదువర్షము లమోఘముగా కృషి సాగనిచ్చి నా
తిప్పలలోన నాదుకొని దీవ్యదఖండకవిత్వసృష్టికిన్
ముప్పిరిగొన్న దీవనలు ముచ్చటలూరగ నిచ్చి సాకు నా
యప్పలబుట్టుపుట్టువున కాతనిభార్యకు నేటికోళ్లగున్.

న న్నభినందించిన వి
ద్వన్నుతప్రోద్దామపండితమహాశయులన్
సన్నుతి జేసెద వారల
ప్రసన్నన కవితాప్రశస్తరమణీయతకున్.

పటువిద్వత్తు గలట్టివారలను సంభావించు నీదివ్యవి
స్ఫుటహస్తమ్మునకున్ నమస్కృతులు దీప్తుల్ జిమ్ము నీభావపున్
ఘటనాశక్తికి మెచ్చుకో లగుత హైందాదివ్యవంశేంద్ర! వేం
కటనారాయణ! మీకునబ్బెడిని సౌఖ్యశ్రీయశోగానముల్.

## అ క్ష రా క్ష త లు

గుమ్మలూరివారి కమ్మని కవనమ్ము
నాహృదంతరాన పోషణించు
వార లిచ్చు శాలువా నాకు కబ్బమై
బ్రతుకు తెరువులోన వఱలుగాక !

పిలుపునుస్వీకరించి కడుపేరిమి కూరిమి మోసులెత్త నిం
పలరగ నీసభాస్థలికి నాదృతిమై యరుదెంచినట్టి పె
ద్దలకు రసజ్ఞవర్యులకు తద్దయు నాహితకోటికిన్ నమ
స్సులు పొనరించెదన్ గవనమందరిమెచ్చ కృతజ్ఞతాహృదిన్.

*

# బుల్లెయ్య

హృద్యోద్యత్ ప్రతిభాసమగ్రతను నాంధ్రీవిశ్వవిద్యాలయో
పాధ్యక్షత్వము నిర్వహించిన భవత్ ప్రజ్ఞాధురీణత్వ మీ
విద్యావార్ధులసంస్తుతిన్ బడసె దేబెల్ గుండె లల్లాడ మీ
ప్రోద్యన్మంగళదీవ్యదూహాలకు శ్రీ బుల్లెయ్య విద్యావిభూ !

అరయంగా బహువత్సరాలు ఘనవిద్యాశాఖలో గల్గు మీ
చిరకాలానుభవమ్ము తెల్గులకు సంజీవత్వమే యూను ని
బ్బరపుం డెందముగల్గి ధీప్రతిభచే పండించినా రెన్న న
బ్బురపుంగీరితిసస్యముల్ కడుముదమ్మున్ విశ్వవిద్యాస్థలిన్.

ప్రతిభావంతులపాలనాపటిమలో రాణించె నాంధ్రోజ్వల
స్థితి కీవిశ్వకళాలయ మ్మపుడు ప్రస్ఫీతంపుమీపాలనా
ధృతిచే బెంపెసలారె నేడహో! జగచ్ఛ్రేయమ్ము కాంక్షించుమీ
ధృతికిన్ నిర్వహణైకసర్వకృషికిన్ శ్రీ బుల్లెయాఖ్యా ! నమః.

సదయాంతఃకరణా ! గుణైకభరణా ! సౌజన్యసద్భావనా !
కుదుటంబడ్డది యూనివర్సిటి యశఃకోటీరముం దాల్చి యాం
ధ్రధరామండలమందు నీవలన హుందాగా ప్రయాణించుచున్
ఇది మీదక్షతకున్ యథార్థతకు నెంతేగొప్పతార్కాణమా.

అతిధైర్యసాహసం బైన చేతలతోడ
తెలుగుల మంత్రముగ్ధుల నొనర్చి
విశ్వవిద్యాలయవిపులాభివృద్ధికి
నికరమౌ పెనుప్రణాళికల వైచి
ఘనతగాంచిన యశోధను లైన విజ్ఞాన
వేత్తలప్రణతుల స్వీకరించి
నిఱుపేదయైన నంతరముజూపక దయా
యత్తైకదృక్కుల నాదరించి
తెనుగుజనప్రశంసాబ్ధి గాహన మొనర్చు
మేరుభూధరధీర ! గంభీరమూర్తి
బుధవిధేయ ! విద్యాముఖ్య ! బుల్లెయాఖ్య !
మీయశస్సు ధరిత్రిలో వెలగు గాక !

## బు ల్లె య్య

మేలిమిక్రొత్తతీరులను మేకొనజేయగ నాంధ్రవిశ్వవి
ద్యాలయపీఠ మెక్కిన మహామహులందఱికన్న కీర్తి మీ
కే లభియించె నిబ్బడిగ యీసకలాంధ్రము శంససల్పి మీ
పాలనమందుగల్గు ప్రతిభన్ గుఱుతించెను బుల్లెయాభిధా !

తొలికావ్యరచనాకుశలుడు మహామౌని
ప్రాచేతసుని సుధీవై భవమ్ము
ధర్మజ్ఞు డగు భారతగ్రంథకర్త యా
పారాశరుని జ్ఞానభావపటిమ
యోచనాబలుడు మహోజ్జ్వలప్రతిభుండు
యౌగంధరాయుని యాత్మబలము
అనుని మేషము సమస్యలనెల్ల దీర్చు మం
త్రి తిమ్మరుసు దివ్యతీక్ష్ణదృష్టి

నిండు మీపరిపాలనానియతి కెలమి
మీ విశాలమహాదృష్టిశీవి కెపుడు
ప్రమద మొప్ప సాక్షీభూతములు నిజమ్ము
లంకపల్లి బుల్లెయ ! నిష్కళంకచరిత !

## అ క్ష రా క్ష త లు

మితసంభాషణముంబొసర్చెడిమహామేధానిధీ ! దొడ్డసం
స్కృతికిన్ దోహదమిచ్చి వానివిలువన్ గీర్తించి తన్మార్గమం
ధతిసంతోషముతో జరించుచు నుదాత్తంబైనభావాన కం
కితమైపోయిన మీచరిత్రకు జనుల్ కేల్మోడ్పు లర్పింపరే.

మనసులోన వాకు లనుటలోన మఱింక
పనులలోన తాపసునివిధాన
పరగి విశ్వమానవత గోరు శ్రీ బుల్లె
యాభిధేయ ! మీకు నగుత సుఖము.

*

# పరీధావి

విశ్వజగతి మెచ్చ విజయశంఖమ్మొత్తె
క్రోధి కాని దగు విరోధికృత్తు
ఎట్టిమార్పు కూర్తు విపుడు పరీధావి
వత్సరాఖ్య ! నీకు స్వాగతమ్ము.

మాలోమాకిట రేగినట్టి విషసంబధమ్ములం గాంచి యీ
భూలోకమ్ము కరాళభుగ్నవచనంబుల్ గుప్పి మాగౌరవ
శ్రీలన్ ధూళినిగప్పుచున్నయది ప్రేరేపించుతన్ నీకళా
లీలాలాస్యము లెప్డు మా తెలుగుపల్లీపత్తనా లన్నిటన్.

రాజుల్ రోజులుగాని యీనవయుగారంభ ప్రజాస్వామ్యపున్
తేజీపైవసియించు భాగ్యమునకై తీండ్రించి జృంభించె పా
ర్టీ జెండాలు నభోంతరాళమున నార్తింజెంది గుర్తించె దీ
ప్తాజాగ్రన్నవమానవుం డెటుల స్వేచ్ఛాస్యందనం బేగునో.

కలుషాత్ముల్ పరిపంథివాహినుల యుగ్రద్వేషణోద్రిక్తతల్
కలిసెన్నీటను విప్లవోత్సుకత ఢక్కా-వీథిలో స్వేచ్ఛగా
మలగెన్ జీవనవాయువుల్ సమరసంభావ్యమ్ముగైకొన్న వీ
రుల రక్తోజ్జ్వలదీప్తులందమరె దారుల్ నూత్నవర్షప్రభూ !

ఘనతంజాట విరోధికృత్తిడెను బంగ్లాదేశసామ్రాజ్యల
క్ష్మని కష్టాలకు కాన్కగాఁగ, ముజిబర్ చిర్నవ్వుతో విశ్వవం
దనముల్ గైకొనె మేటిశాత్రవుల దుస్తంత్రాలు భూగర్భమం
దణగెన్ గుండెలు నిబ్బరించెను పరీధావీ! ప్రతిష్ఠచ్ఛవీ!

కలవారెల్లరు కూడబెట్టుకొని సౌఖ్యశ్రీలలో మున్గి పే
దలదుఃఖాలకు సానుభూతినెఱపన్ దారిద్ర్యమింతైన నా
వలకుంబోవునె యిండియాపొలముల్ బాహాటమ్ముగాసాగు నీ
కులరోగాలు నయమ్ముగానియెడ వాక్రువ్వన్ వినూత్నాబ్దమా !

వాసిం గూర్పని హెచ్చులొచ్చులకుతప్పా? యిందిరాగాంధి యా
శాసం దేశము, శీర్ణమానవుని తీక్ష్ణంబైన వైప్లవ్యదీ
క్షాసంఘర్షణ మాగిపోవలెను శంసంబౌ గరీబీహఠా
వోసిద్ధాంతము మారుమ్రోగవలె దిగ్భూభముల్ ప్రశంసింపగన్.

## ప రీ ధా వి

కలుగునా శాంతికి నిలయమైనట్టి గా
తమ బుద్ధదేవుని దర్శనమ్ము
వెలుగునా భువనమ్ము కొలువులందిన యశో
కుని గాఢధర్మబోధనపుకాంతి
చెలగునా సత్యవాక్శీలుండు బాపుజీ
మహనీయమైనట్టి సహనవాణి
మలగునా రెడ్డివేమనకవీశానుని
సంస్కారసుకవితాస్యందనమ్ము
ఓ పరీధావి ! నీదుమహోదయమున
బ్రతికి చెడినట్టి నాజాతి క్షితితలాన
శిరము నెత్తి జీవించెడుపరువు నొసగి
ఆశిషము లిడుము కృపాదృగంచలాల.

ఎట్లెటువచ్చునో తెలియ దింతకు చెప్పగ మంచివానికే
పాట్లు ఘటిల్లు మానవత భగ్నమందు నొకొక్కసారి యీ
వోట్లవిజృంభణోద్ధతికి పుణ్యము పాపములన్ లిఖించు నీ
నోట్లకు బల్ గిరా కిపుడు నూతనవత్సరమా ! గ్రహింపుమా !

గడ్డము బెంచి క్షుద్రమగుగాటపుసత్తులతోడ దేశమున్
ఎడ్డతనమ్ములో నునిచి యొక్కటివీరులుగా చరించువా
రొడ్డినయుచ్చులో జివికియున్నది వేలతరాలనుండి మా
పడ్డయవాంతరాలను నివారణసేయు ముగాదిసత్ప్రభూ !

వర్ణము స్వర్ణమై కొలతబద్దకు నందక నింగి కెక్కె యే
దుర్ణయముం బొనర్చినదొ ధూర్తత నీకువచింపనేల మా
నిర్ణయముల్ నిరంకుశము నీతికి ఖ్యాతికి తావులేని యీ
జీర్ణపుటూహశాలుర కసిన్ గబళింపు ముగాదినాయకా !

టకటొంకువాక్యాల నికమీద నెప్పుడైన
పలుకవద్దని చెప్పగలవె నీవు
ఎదు టొక్కమాట వేఱొకట వేఱొకమాట
తప్పటంచును నీవు మప్పగలవె
అవివేకజనులస్నేహాలు మోసా లని
ఖచితమ్ముగా చెప్పగలవె నీవు
ఆత్మవంచకులైన యవకాశవాదుల
చెంప జేయిడి మందలింపగలవొ

# ప రీ ధా వి

పట్టపగలె మానవసమాజమును దోచి
దొరలుగా నటించు ధూర్త జనుల
ఆగడాలనెల్ల నరికట్టెదవా పరీ
ధావి! యిది సవాలు ధాత్రి నీకు.

గంగాసముత్తుంగ రంగన్మహాభంగ
జాలమ్ము గని జబ్బ చఱచినాము
ఘనుడైన వాల్మీకిముని మహాసుకవితాం
భోరాశిలో మున్గిపోయినాము
శంకరాచార్యులస్వామి వేదాంతని
ర్ఝరులలో తానమ్ము సలిపినాము
రామచంద్రుడు దశరథునిమాటకు జవ
దాట డం చెలుగెత్తి చాటినాము

పూర్వసంస్కృతి గని మెద మురిసినాము
ఏకతాభావమున కింత మేడ్చినాము
ఎదుగలేక ఢంకా బజాయించినాము
జయ మహో! పరీధావి! వత్సరసమాఖ్య.

## అ క్ష రా క్ష త లు

జ్వలనములోన ద్రోసెదో వసంతము సల్లెదో పెన్ క్షుధావ్యథా
కులితమనస్కులైన జనకోటికి నేమనిచెప్పెదో యదే
పలుకుము రక్షరేఖయయి భాసిలు మానవజాతి కీధరా
వలయమునన్ వినూతనపువర్షసమాఖ్య ! సమాదరింపుమీ !

కరుడుంగట్టిన ఛాందసోత్తములకున్ గళ్యాణపీఠాలు నే
ర్పరచంజాలిన దేవతాయతనపుంబ్రహ్మల్ దరిద్రుల్ నిరం
తరదైన్యమ్ముల గాంచి ఖేదపడ రిద్ధాత్రిన్ గటాక్షించి నీ
దరహాసాలను జిల్కరింపుము పరీధావీ ! దరిద్రాళిపై.

నడిపింతువా భువనాలు కొండాడ భా
రతజాతినెల్ల ప్రగతిప్రతోళి
కుడిపింతువా బువ్వకు కటకంబడు
దీనజాతులకు నాతిథ్య మొసగి
జడిపింతువా సమాజముపేర బ్రతికెడు
మతమహామాఢ్యదుర్మతులతతిని
గడిపింతువా పదికాలాలపాటు దే
శీయభాగ్యోదయశ్రీమహత్తు

# పరీధావి

చవుకబారైన సాహిత్యసరణి గాంచి
వనట నొందెదొ యశ్రుతర్పణము విడిచి
ఓపరీధావి ! నీదు మహోదయమున
జగతి కనయమ్ము వాసంత మగునుగాక !

సామంబింతయు లేక దోచుకొని బొజ్జల్ పెంచి గర్వించుభూ
కామందుల్ ధనదాహు లీపుడమిలో కాండ్రించువ్యాఘ్రమ్ములై
స్వామిత్వమ్ము వహించుటల్ దగునె? ప్రస్థానించు రాజ్యమ్ములో
ఏ మోతాదిడి చక్కజేసెదవొ నీ వీయిభ్యవర్గమ్ములన్.

మహనీయుల్ మరియాదకందని మదోన్మత్తుల్ కళావాణికిన్
బహుమానా లిడుచుండు రివ్వికుహనావ్యాపారముల్, వర్ణపున్
దహనజ్వాలలు రాజుకొన్న భువిలోనన్ గల్గునే ! గౌరవ
మ్మహహా! యీ దేశములోనిసంస్కృతికి చిహ్నంబిద్ది సిగ్గయ్యెడిన్.

నతులం బొందినయట్టిపుక్కిటపురాణాలన్ని దేశీయసం
స్కృతికిన్ స్తంభములై చెలంగినవి రాజీలేని బేరమ్ముగా
గతమం దిప్పుడు తత్పురాణములు వర్గవ్యత్యయంబున్ సము
ద్ధతిమై చాటును క్రొత్తమానవుడు ప్రోద్గారించుపూర్వక్రియల్.

అన్యం బింతయు లేక దుర్దశలపాలై జీవనాధార మే
శూన్యంబై విలపించుమానవులకున్ చుక్కానిగా నుండి యా
దైన్యోదగ్రగభీరవార్ధిని యెటుల్ దాటించి యానందచై
తన్యజ్యోత్స్నల నింపెదో కద ! పరీధావీ ! ప్రతిష్ఠచ్ఛవీ !

*

# స్వాతంత్ర్య రజతోత్సవ
# కవితాసందేశము

ముల్లైన్ మూటను చంకబెట్టుకొని యేడ్చున్ స్వీయదేశానకుఁ
వెళ్ళెఁ రెండుశతాబ్దముల్ గడువగా బేరాలు సాగించి నా
నల్లం జుట్టిన సీమభూపతి స్వతంత్రంబైన నాభూమిలో
జల్లింతున్ సుఖశాంతిబీజములు దీక్షాస్ఫూర్తిమై నే డహో!

బహువత్సరమ్ముల పారతంత్ర్యమువల్ల
బూజు పట్టినది నా బుద్ధిబలము
కడలేని యెడలేని కటికిజీవితమున
క్రమ్మిపోయినది నా బందుబస్తు
ముదిరిన కులమతమ్ములకుమ్ములాటలో
ప్రధ్వంస మయ్యె నావంశదీప్తి
కరుడుగట్టినయట్టి కట్టుబాటులలోన
జాఱిపోయినది నా చదువుసాము

# అక్షరాక్షతలు

నాల్గువేలయుగాల వర్ణాలవలల
చిక్కుకొని గాయపడ్డ నా జీవచరిత
తడిసి ముప్పందు మయ్యె నధ్యాహ్నగతిని
ఇరువదై దేండ్ల స్వాతంత్ర్యచరితలోన.

ఇరువదియైదువత్సరములే యయినన్ మఱి వేయివత్సరా
లరిదిగనైన భారతమునం దలవోకగ సంచరించి ని
బ్బరమున జబ్బసూపి పెనువర్గపుబల్మిని నెత్తిసూపు నీ
నరులకు గాంధి మేల్మివచనమ్ములసారము లొంటపట్టునే ?

పొట్టకూటికి యజ్ఞములపేర బ్రతుకని
విజ్ఞానధను లుద్భవించునాడు
ఈర్ష్యాంకురములు రేకెత్త నిజనులతో
సంఘనిర్మాణమ్ము జరుగునాడు
క్షణికమైనట్టి ఉచ్ఛాభోగములు మాని
పరిపాలకుడు మంచి జరుపునాడు
పరిధిదాటనిచూపు నెఱపిన మొనగాని
గుండెలో సమత వెల్గొందునాడు

# స్వాతంత్ర్య రజతోత్సవ కవితాసందేశము

చెప్పినది చేయకుండగ చేసినట్టి
దాని చెప్పక మార్జించువాని కలుష
హృదిని బాపువాక్కులు మొల్క లెత్తునాడు
నాడు జాతికి నిండుపున్నమిదినమ్ము.

సమతం జూపి విశాలదృక్పథముతో సర్వంసహాచక్రభా
రము నాదన్నతలంపు గల్గిన ఋషీంద్రశ్రేణికిం బెద్ద గా
తము డానా డొక సత్యకాముసకు విద్యన్నేర్పి యీపర్ణకు
ద్యములం బ్రద్దలుగొట్టె నేడొకడు లేడా ? ఆర్షభూమండలిన్.

నాజాతీయత దిగ్దిగంతములలోనం బర్వ నస్మద్యశో
రాజశ్రీకి జొహారులందికొనుచే ప్రాముఖ్యమం చాత్మలో
మోజుంజూపక నిచ్చగించను సతమ్మున్ దీన మర్త్యాళి యు
త్తేజంబొందుట కీధరిత్రిని ప్రయత్నింతున్ యథార్థంబుగన్.

నవ్యస్వరాజ్యమ్ము నాజన్మహక్కని
తిలకుసందేశమ్ము తిరుగువేళ
సత్యక్షమాశాంతి జగతి కాయువటంచు
బక్కకోమటి గాంధి పలుకువేళ

## అక్షరాక్షతలు

పంచశీలవిశాలభావమ్ము గొప్పని
జవహరు లోకాన జాటువేళ
పరవానిపాలన వద్దంచు నేతాజి
సింహమ్ము కసరి గర్జించువేళ

అప్పు డాబాలగోపాల మంత కలిసి
కదిలెనా యన్నవిధముగ కానుపించె
స్వీయదేశస్వరాజ్యసంసిద్ధికొఱకు
ఏమి యట్టిచందాలు లే విప్పు డకట.

మంచిదే గంగమ్మ మధురాంబువులు పట్టి
చవిటినేలకు యాత్ర సలుపుటయును
గొప్పదే పావనగోదావరీనీర
మలబంజరుల పాఱగలుగుటయును

దొడ్డదే ప్రజలు సంతోషింప బోనమ్ము
నెఱసగా పంట పండించుటయును
పెద్దదే మఱి గరీబీహఠావో ప్రణా
ళిక చిత్తశుద్ధి బాలించుటయును

## స్వాతంత్ర్య రజతోత్సవ కవితాసందేశము

కాని మానవతకు గాయమ్ము కల్గించు
సంటరానితనపు టంతరమ్ము
సాగుచున్నయట్టి జగతి కెట్లబ్బును
సామరస్యధోరణీమహస్సు.

కరుడుంగట్టిన యాంగ్లభూపుల యహంకారక్రుధాజ్వాలకున్
ఎఱవైపోయిన దేశభక్తుల తలంపే నేటిస్వాతంత్ర్యపున్
చరితం జాటిన దీమహోత్సవప్రశస్తం బైనకాలమ్ములో
జరుగుంగావుత భారతోర్వికి లసత్ సౌభాగ్యసంపద్గతుల్.

ధ్వజమెత్తరాదు సిద్ధాంతమ్ముకొఱకు వే
ఱొకభాషపైని మఱొక్కభాష
తలయెత్తరాదు విద్యావిధానములోన
చీటికిమాటికి చేర్పు మార్పు
మొలకెత్తరాదు బాపూజిశిష్యునియెద
అసహననీచభావాంకురములు
దండెత్తరాదు పేదలచిన్నబ్రతుకుపై
కలవాని దార్ఢ్యకాండకలన

ఐకమత్యభావ మమరని విద్వేషి
చిత్తమందు చివురు లెత్తరాదు
కశ్మలమ్ములైన కపటబీజమ్ములు
మందుకైన నాదు హైందవమున.

తగ్గనా నింగిలో తారాడుచున్నట్టి
ధరల దయ్యాల యుత్తాలబలము
మ్రగ్గనా వేదధరాస్థలి స్వార్థంపు
పాపాల కిలు ఢాకినీపిశాచి
స్రగ్గనా చైతన్యజాగృతికల నేల
చీకాకుపడువాని శోకవహ్ని
మ్రుగ్గనా భువనభూములు జోత లర్పించు
కర్మందిగాంధిదీక్షాఫలమ్ము

ఎంత ఖనిజరాశి యెంతెంత ఫలరాశి
యెంత పాడిపంట యెంత యున్న
సమత లేనిజాతి సాగదు రవ్వంత
ధర్మమైన యభ్యుదయపథాన.

## స్వాతంత్ర్య రజతోత్సవ కవితాసందేశము

తలపన్ మేటికళాపతంసులకు నుద్యచ్ఛాస్త్రవిజ్ఞానవే
త్తలకున్ లే దిసుమంతయాదరణ మంతర్జాతివిఖ్యాతికిన్
విలువంగూర్పని యీ సమాజమునకున్ వేయేండ్లకైనన్ సము
జ్జ్వలసౌభాగ్యసుఖైకదీప్తమగు సంస్కారంబు నిండారునే ?

జగతికి నార్షధర్మమును జాటి యఖండప్రతిష్ఠగొన్న మా
బుగతల ధార్మికోద్యమప్రభూతప్రశస్తి క్రమక్రమమ్ముగా
దిగినది తగ్గిపోయినది దీనికి స్వార్థము హేతుభూతమే
లగనమునందు నెవ్వ డొగి లాగునొ? యున్నతికై తలంపగన్.

కబురుల్ సెప్పుచు కాలముంగడుపుచున్ గమ్మత్తులాలించుచున్
పెబువుల్ సల్పిరి జీవితమ్ములను పృథ్విన్ భోగభాగ్యాలలో
సబబా? నూటికికొంద ఱిట్లు బ్రతుకన్ స్వాతంత్ర్యదేశమ్ములోన్
డబుడుక్కుల్ సహితంబు జీవితములన్ సాగింపతీరవ్వలెన్.

తనజాతిదైన స్వాతంత్ర్యమ్ముపై యొక్క
డెలమితో నుదికంబ మెక్కునాడు
తనజాతిభవితవ్యమును గోరి యొక్కండు
వేగాన చెఱసాల కేగునాడు

# అ క్ష రా క్ష త లు

తనజాతిచారిత్రమును జాట నొక్కంచు
ప్రేమమై రుధిర మర్పించునాడు
తనజాతిపావనత్వమ్ము ప్రబోధింప
నొక డష్టకష్టాల నొందునాడు

సహజదేశభక్తి రహియింప దేహాన
గడ్డిపోచ గాగ కాయములను
నర్పణమ్ము సేసి రానాటి యుత్సాహ
మిపుడు భరతధాత్రి నేలవలయు.

ఊరికిదూరమంచు నిలుచున్న గృహస్థులు నూరిమధ్యలో
గారవమేర్పడన్ బ్రతుకగల్గిననాడు స్వతంత్ర దేశమం
దారయ సంస్కృతిప్రభల కాయువుపట్టుగ దోచు గాని యా
దూరము లింక దూరమయి తొందర సేసిన జాతి పాడగున్.

ఆశింపవచ్చునా అర్హత లేకపో
యినసరే తలకుమించినపదవిని
ఘోషింపవచ్చునా గుణహీను డగువాడు
లేనిపోనట్టి యుల్లేఖనములు

## స్వాతంత్ర్య రజతోత్సవ కవితాసందేశము

దూషింపవచ్చునా దుర్మార్గచరితుండు
మంచివానిగుణమ్ము లెంచకుండ
భాషింపవచ్చునా పరుషవాక్యమ్ములు
వదరుబోతు స్వదేశప్రగతి కలిగి

శుద్ధమైన లక్ష్యసిద్ధాంతమ్ములయందు
నమ్మకమ్ము జూపనట్టివాడు
కారుకూతలాడ నోరెత్తవచ్చునా ?
త్రాష్ట్రబుద్ధి నీ స్వతంత్రవేళ.

బెట్టుంజూపక పేదవారలకు నిప్పించన్ మహోదారతన్
పెట్టెన్ సంతక మింగ్లుకట్టుకొనగా పేరీసుతో కొంద ఱి
క్కట్టిల్ గల్పనసేయుబూని రిది లోకజ్ఞానమా ? లేనిచో
పట్టా లెందుకునీయ రియ్యది ప్రభుత్వప్రేమసిద్ధాంతమా ?

ప్రణతుల్ సల్పెను భారతీయుల దయావాత్సల్యభావమ్మునం
గని లోకమ్ము సమస్తదేశములలోనన్ గల్గె వీరాంగనా
మణి మా యిందిరకున్ యశస్సు, సుఖసంపద్దివ్యదానందశాం
తిని వెల్గొందెడుగాక యీభరతపృథ్వీరాజ్య మెల్లప్పుడున్.

## అక్షౌక్షతలు

చలిమూని యలహిమాచలమ్ముపై నటరాజు
గంతులు వేయుచున్నంతదాక
బ్రహ్మయ్యగారితో భాషామహాదేవి
హర్షాన నడుపుచున్నంతదాక
అహిశయ్యపై లచ్చి యధినాథు డానంద
మంద నిద్రించుచున్నంతదాక
భుజగనాథుడు మహామోదాన భూభార
మంతయు మోయుచున్నంతదాక

సత్యశాంతిదయయు సత్యాగ్రహమ్ములు
నిండుకొన్న భరతఖండమందు
పాతికేండ్లు గాదు పదివేలవర్షాలు
విమలశాంతి తాండవించుగాక.

*

# అభినందనము

ఆంగ్లేయుల్ కుటిలప్రవర్తకులు దేశాధీశులై స్వార్థులై
బంగ్లాదేశము సృష్టిజేసిరి యపూర్వంబైన త్యాగమ్ములతో
బంగ్లాముక్తి దళమ్ముల లేకమయి చివ్వన్ గెల్పు సాధించుటల్
"లాంగ్లివ్" నెహ్రూకుమారి! నీదయిన సారథ్యమ్ము వాక్రువ్వగన్.

అరిరాజకులనాశమైన నాజి దుమికిన
వీరాంగనలశౌర్య విక్రమమ్ము
జన్మభూమ్యర్థమై సాహసించిన రాజ
నివహమ్ముల పెనుగుండె నిబ్బరమ్ము
సడలనికార్యదీక్షా సాధనమ్మునో
తిరు గింత లేనట్టి తీక్ష్ణదృష్టి
ఎదిరెంతవాడైన నింతేని జంకని
జమ లేని యాత్మవిశ్వాసబలము

## అ క్ష రా క్ష త లు

కుదురుకొనుచును నీకోన గూడుకట్టి
భారతప్రాజ్యసామ్రాజ్యభావిదశకు
నడుపుచున్నది దిగ్దిగంతాలు మ్రొక్క
ఇందిరా! భారతేందిరా! హా! జయోస్తు.

ఆపలుగాకిపాగ్వమతు లందఱు బొబ్బలువెట్ట చండికా
రూపము నెత్తి హైందవము రూపము విశ్వముజాటినావు ధా
త్రీపరిరక్షణార్థము మతిభ్రమణుండగు నిక్సనుండు ల
జ్జాపరివేష్టితుం డగుట జాలును దేశము పొంగిపోయెడిన్.

నెత్తురుద్రావుపాగ్బలము నీజననీభువనమ్ముపైకి దం
డెత్తుట వీరభారతమునే కదలించుట సంగరమ్ములో
చిత్తయినారు శాత్రవులు చెల్లెను నీప్రతినల్ జగద్దిశా
భిత్తితలాన నీపసిడిపేరు లిఖింతురు జహ్వారుప్రసూ!

దిక్కున్ మొక్కును లేక బంగ్లజను లుద్రేకమ్ముతో ప్రాణముల్
తుక్కైకనన్ గొనయూపిరున్నవఱకున్ దుర్దాంతశౌర్యక్రియన్
ఢక్కాలో జయచిహ్నితంబయిన జెండా నిల్పినా రివ్వి నీ
పక్కాకీర్తికి నాయకత్వమునకున్ ప్రత్యక్షతార్కాణముల్.

# అ భి నం ద న ము

భువనమ్ముల్ గొనియాడ పన్నినరణవ్యూహాలు స్వర్ణాక్షర
చ్ఛవులం జిమ్మెను నీమనోద్రఢిమ మాశాజ్యోతులై యిండియా
భువి కౌన్నత్యపథమ్ము సూపెడిని డాబుల్లేని నీగాథలున్
అవతారమ్మును దేశజాతికి భవిష్యజ్జీవనాధారముల్.

నింగిపయిన్ జలాలపయి నేలపయిన్ జెలరేగి రొక్కపై
పొంగినశౌర్యధైర్యరసముల్ దమగుండెల పారగా మహో
త్తుంగజయమ్ము గాంచి రిపుధూర్తులగర్వ మడంచినార లా
శాంగనలెల్ల మెచ్చ సమయజ్ఞత వాహినులెంతలేసివో.

నలిపెద క్రుద్ధతన్ పదిదినమ్ములు దాటకముందె నిండియా
పొలమును, రూపుమాపెదను పో నవభారతజాతి నగ్గిమం
టలగురిపించి ప్రాగ్జనత నవ్వగ నం చనుచున్ ప్రగల్భముల్
పలికిన 'యాహ్యఖాను' మెడవంచెను సిగ్గున నిందిరాంబికా.

చెన్నుంగూర్చునటంచు నెంచిన నియాజీఘూజిశాబర్ క్రుధా
సన్నాహంబులు రిత్తవోయినవి నిస్తంద్రప్రథాశౌర్యసం
పన్నుల్ భారతవీరసైనికుల దుర్వారోగ్రబాహాస్త్రపున్
తన్నుల్ చేత జయైకడిండిమము మ్రోతల్ మ్రోగె దిక్పాళిలో.

## అ క్ష రా క్ష త లు

అతిలోకోత్తరమైన యీజయము నీదమ్మా ! ప్రపంచమ్ము భారతయోధాగ్రణులౌ జవానులకు సర్వత్ర ప్రశంసాంజలుల్ కుతుకంబున్ బొనరించుచున్నయది నీకు న్నేడు జాతీయభారతరత్నాంచితమైన యీబిరుద మర్హంబై వికాసించెడిన్.

పుష్పింపవలె బంగ్ల భూములు రుధిరమ్ము
    ధార లింకినచోట ధాన్యసుమము
చరియింపవలె బంగ్లధరణిపై నస్వేచ్ఛ
    సంతరించినచోట శాంతిలక్ష్మి
సవరింపవలె బంగ్లభువనాన బ్రద్దలై
    నట్టివిద్యాదేవతాలయమ్ము
వివరింపవలె బంగ్ల విపులపౌరాతన్య
    సత్సంప్రదాయప్రశస్తగతులు

దెబ్బతిన్న ఢాక తీవరించినదాక
క్రొత్తబలము పుంజుకొన్నదాక
బంగ్లభూములెల్ల బంగార మగుదాక
ఇందిరమ్మశక్తి కెదురు లేదు.

*

# దుద్ధులు

కలవా డొక్కడు ఘనముగ
సలుపగ సన్మానసభను సచివవరున కు
జ్జ్వలమతియై తలచి యశః
కలితుం డగుకవికి తంతి క్రన్నన బంపెన్.

ఆ తంతి నందుకొని కవి
సాతముతో పొంగిపోయి సన్మానసభా
భూతలమున జేరుకొన ఖు
షీ తాత్పర్య మ్మెడంద చిందులు త్రొక్కన్.

తంతిని పంపినపెద్దయు
తంతిని పంపుమని నట్టి తద్జ్ఞుడు గవిది
గ్దంతికి పయనపు ఖర్చులు
సుంతేనియు పంపరై రి సుకవియు నంతన్.

అంతటివాడే నాకున్
తంతిని పంపించమనుట తా నీపయనం
బంతట జరిగినఖర్చుల
నంతయు చెల్లింపకుండునా ? యని తలచెన్.

అప్పటికే యప్పులలో
తిప్పలలో కుములుచున్న ధీకుడు కవి తా
నప్పరమసభకు వెళ్ళుట
తప్ప దనుచు స్వాంతమందు తగయోజించెన్.

పెండిలినా డర్ధాంగికి
బండెడుకష్టాన నిడిన బంగరునగ లె
న్నండో జీర్ణించెను నీ
గండం బెటు దీరు నంచు కనలుచునుండన్.

ఏమండీ యెందులకో
ఈమెయి చింతించువార లీరలు మీా రా
గ్రామమునకు వెడలి సభా
ధామములో మాటలాడి దయసేయు డికన్.

# అభినందనము

ముద్దులు నాకడ నున్నవి
పద్దునకుం బెట్టి వలయు పయనపుఖర్చుల్
దిద్దుడు సభకుం బిలిచిన
పెద్దయు మిము నాదరించు వేడుకమీఱన్.

భార్యామణి చేయూతకు
శౌర్యము పౌరుషము మేను జాగృతిగొలుపన్
కార్యాచరణుడు సుకవియు
ధైర్యముతో మంత్రిసభకు తా పయనించెన్.

పిలిచిన నిర్వాహకుడును
పిలిపింపు మటంచు చెప్ప పెద్దయు కవినిన్
తిలకించి సంతసించిరి
వెలార్చిరి చిఱునగవులను పెదవులజాఱన్.

మంతిరిపేరిట నాతం
డెంతో గడియించినట్టి యీ ధననిధిలో
సుంత వ్యయించెను మంతిరి
సంతోషించెను సభయును జరిగె జయముగా.



౬

# అక్షరాక్షతలు

కుప్పలు తెప్పలుగా పూ
లప్పారమున మంత్రికంఠమం దలరింపన్
దెప్పర మయ్యెను మగువల
కొప్పులలో పూలు తురుముకొనుట నిజముగా.

ఆనందార్ణవవీచిక
లో నంత మునింగె మంత్రి పొగడ తన కి
ట్లానినసభ యెందైనను
గానగ లే డనుచు తానె ఘనుడ నటంచున్.

మంతిరిపదవికి ప్రణతులు
తంతులుగా జేసి సాగు దౌర్భాగ్యులు తా
మెంతో కొనియాడిరి యీ
మంతిరి దౌర్భాగ్యుడును సమాంతము పొంగెన్.

మంతిరిసలహాకై నెం
తెంతో దూరమ్మునుండి యేతెంచిన సు
స్వాంతుండగు సత్కవికిని
వం తొనగూడెను పఠింప పద్యము లెలమిన్.

## అ భి న ం ద న ము

తరువాత సభానంతర
మరయగ నిర్వాహకుండు నామంత్రియున్
ఎఱిగినవారలకెల్లను
కరచాలన మిచ్చి రవల కారెక్కిరిపో.

పిలిచిన కవినిన్ గుఱిచియు
తలపక కవికర్మమునకు తాము వదలి వా
ర లెదో మత్తున బడిరట
అలసట తీర్చుకొనిరట వ్యథాకులమతులై.

కంటం దడివెట్టుచు కవి
కుంటువడినగుండెతోడ కుమిలి యెట్లో
యింటికి చేరెను: "దుగ్దలు"
కంటం గన లేదుకొంత కాలమువఱకున్.

తరువాత నాప్తుడొక్కడు
జరిగినకథ కవికి తెల్పె చక్కగ నామం
తిరికులజుం డవు గా వని
ఖరుచు లిడగ బుద్ధిపుట్టగా లేదనుటల్.

పాపము కుడిపెనో మఱి కవి
శాపము కుడిపెనో తలంప జబ్బున కెరయై
పాప మ్మామంత్రివరుం
డాపరలోకమున జేరె నని కవి వినియెన్.

# స్వేచ్ఛాగీతము

స్వచ్ఛస్వాంతుడు బాపుజీ విమలవాక్సారప్రభావఘుమా
స్వేచ్ఛాజీవననవ్యమారుతము వీచెన్ నీగృహంబందు నీ
యిచ్ఛాభావుకతల్ గహించెడిని పూయింపించు సౌహార్దపున్
గుచ్ఛంబుల్ భరతప్రజామనములందున్ దేశదీక్షారతా !

నీయాలోచనలో నెదో మెఱపు గాన్పించెన్ పురాబంధముల్
త్రోయంబడ్డవి జాతిజాగృతికి ప్రత్యూషప్రఘాదుందుభుల్
మ్రోయింపంబడె నిందిరమ్మకనుచూపుల్ సాగె సైన్య ప్రజా
శ్రేయోర్థమ్ముగ సుఖింత్రు పేదలు ప్రహర్షీభూతచేతస్కులై.

ఈ చైతన్యవికాసదీపశిఖ మున్నే నాడు వెల్గొందలే
దీచట్కారిజనాళిగుండియలలో నీనాటియుజ్జీవన
ప్రాచుర్యమ్ముగ మఱొక్క మెట్టునకు ప్రస్థానింపగా జేసె న
గ్వాచీనస్థితికిన్ జోహారు లిడి స్వర్ణస్తంభ మెత్తించరా !

# అక్షరాక్షతలు

బ్రతుకులో కడగండ్లు పడినవాని మొగాన
మందహాసపు రేక చిందునాడు
పరదాస్యబంధాలబాధ తప్పతలాన
విజయచంద్రికలు వ్యాపించునాడు
గతము మేలన్న మూర్ఖస్వామిచిత్తాన
ఉత్తాలభావమ్ము లూనునాడు
గుజరాతుమునిపేర జనువాని మార్గాన
శాంత్యహింసాజ్యోతి సాగునాడు

మతముపెత్తనమ్ము మరగినసన్న్యాసి
యొడలు వంచి కష్టపడిననాడు
స్వర్గసుఖము హైందవమ్మున సోదరా !
తుఱగలించునాడు పరిఢవించు.

వెతలన్ మున్గినవారికిఁ సతము నిర్విఘ్నమ్ముగా సాగిపో
వుత దైనందినజీవితమ్ము లరుసమ్మున్ సౌఖ్యసౌభాగ్యసం
గతసర్వోదయశాంతివిప్లవబృహత్కార్యాలకున్ మూలమై
బ్రతుకుంగావుత నవ్యభారతము పురాగా సముద్యద్గతిన్.

## స్వేచ్ఛాగీతము

విజ్ఞానకాంక్షులై విద్యార్థిబృందంబు
దేశభక్తిపథాన తిరుగునాడు
కుక్షింభరులు నాయకులు సేయుమోసాలు
ప్రజలచే నరికట్టబడిననాడు
కలవాడు లేమిలో కనలి వానిని గాంచి
ప్రేమమ్ముతో నాదరించునాడు
ఇది మంచిసాహిత్య మిది కాదటంచు చె
ప్పెడుపరీక్షకు లుద్భవించునాడు

తేటతెల్లమైన మాటమంతికి సదా
క్షోణి నోము నోచుకొన్ననాడు
నాయెడంద పొంగు నాడు సహోదరా!
శాంతి లేదు నాకు నంతదనుక.

మతవృషభేంద్రముల్ పనికిమాలినవర్ణపుదున్నపోతులున్
జతలుగ సాగి యీభరతజాతిని నాశ మొనర్చి నేటికీ
వితముగ నుంచె నూపిరిని పీల్చుటకైనను శక్తిలేని యీ
పతితకులాలమాట కనుపట్టదు జాగృతిగొమ్ము సోదరా!

# అ క్ష రా క్ష త లు

సాగవచ్చునె ప్రజాస్వామ్యపాలనలోన
విత్తాధిపుని కట్టు పెత్తనమ్ము
మ్రోగవచ్చునె స్వీయభువనమ్ములో దాంభి
కుల నిక్కు టెక్కు డెక్కులరవాలు
త్రాగవచ్చునె గాంధియోగీంద్రుభక్తుండు
మత్తు గల్గించెడు మందునీరు
వాగవచ్చునె యపభ్రంశవాక్యాలను
గట్టిగా చదువుకొన్నట్టిఘనుడు

సోషలిజముగూర్చి భాషింపవచ్చునే
వేలు వడ్డీ కిచ్చు పిసినిగొట్టు
సమసమాజ మిచట స్థాపించి కూర్పించు
సర్వులకును శాంతిసౌఖ్యరాశి.

గుణముల్ కల్గినవాడె జ్ఞాని యని యుద్ఘోషించె చారిత్రముల్
మును పీనాడవి మృగ్యమయ్యెను కులమ్ముల్ పేర జ్ఞానమ్ముకొ
ల్చినదేశానకు లేదు గౌరవము యోజింపన్ రవంతైన నీ
దినముల్ నీవి యఖండభారతము ను తేజింపగాజేయుమీ !

*

V. R. NARLA MEMORIAL LIBRARY *
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

## వేమన

ఒకహఠయోగిమంత్రము బలోద్ధతిమై నిను నావరింప నీ
వొకమహనీయమూర్తి వయి యుర్వర కీర్తి గడించినావు నీ
ప్రకటతరాసుధార గల పద్యసహస్రము లీతెలుంగునా
లుకలఁ బచారుచేసె మునిలోకశిరోమణి! వేమనాభిధా!

అకలంకంబగు ధర్మదేవతయు దుఃఖాక్రాంతయైయొప్ప సాం
ఘికమర్యాదలు గడ్డిమేయుతఱి యోగీ! నీవు ధైర్యమ్ము వీ
డక నిష్పాక్షికదృష్టిమై చెడుగుబండారమ్ము ఖండించి యాం
ధ్రికి లోకోత్తరకీర్తి తెచ్చితివిగాదే! పంటరెడ్యగ్రణీ!

బండకు పూజలన్ సలిపి పామునకున్ మఱి పాలువోసి బ్ర
హ్మాండము పెళ్ళగించెడుమహాత్ములమంచునుడప్పుగొట్టుపా
షండుల నర్చకబ్రువుల స్వార్థముపై ధ్వజమెత్తి మ్రోడుగా
నెండిన తెల్గుగుండెలపయిం బచరించితో కైతగందముల్.

౭౯

# అ క్ష రా క్ష త లు

ఈవుజనించుదాక మఱి యేడి మఱొక్కఁడు తెల్గుభాషలో
నీవలె కైతజెప్పగలనేరిచినట్టిమహానుభావు డాం
ధ్రావనిలో మునిప్రవర ! ఆటవెలందులలోని నాట్యసం
భావన మెంత రెడ్డికులమండన ! నచ్చెనొ నీకు చెప్పగన్.

యజనాలపేర మూఢాచారములు సల్పు
కుక్షింభరులగూబ కుయ్యిమనగ

వసుధజీవనమై యపౌరుషేయమ్ములై
యొప్పారు వేదమ్ము లోరగిల్ల

కుటిలసంస్కృతికి బుక్కులఁపఠించెడి యవి
ద్వాంసులస్వాంతాలు దద్దరిల్ల

జనసమాజమునందు ప్రణుతు లందినవారి
మేధలో విసపుతుమ్మెదలు రేగ

కులమతాలమత్తకలభాలు రేగి వి
శృంఖలముగ ఘీంకరించునపుడు
విప్లవాత్మకరకవిత్వమ్ము నీ తెల్గు
నేల నాల్గుదెసల నింపినావు.

కడిమిం జూపి సవాలుచేయవె? నిరాఘాటాన చైతక్కలా
చెడుసామాజికదుష్టపద్ధతులతో, చెక్కుం బ్రదర్శించి యె
క్కుడుగా బుద్ధిని జూపువారలకు నుక్కుంగళ్లై మైనావు నీ
నుడిలో సత్యమహాత్వగాంగఝరు లెన్నో పొంగి జాల్వాఱెడిన్.

ఎంతటి ధైర్యశాలివో? మఱెంతటి ధీపటిమమ్ముగల్గు వే
దాంతివో? సత్కవీంద్రుడవో? తాఁకొన రెవ్వరు నిన్ను మెట్టవే
దాంతుల నగ్రవర్ణములదాఁడుల మూర్ఖుల దుష్టకర్మసి
ద్ధాంతపిశాచిదంష్ట్రికల దన్నిన నీకు జోహారు వేమనా!

ముచ్చట లూరగా తెలుగుముద్దులపల్కుల గుస్తరించి నీ
వచ్చముగా తెలుంగుకయి ఖైతివి నీవలె జానుతెల్గులో
పెచ్చుగ కైతసెప్పి వినిపించినవారలు తెల్గునాడులో
మచ్చునకైన లేరు పోడిమాటలు పల్కగనేల నిచ్చటన్.

కాషాయశాటికల్ గట్టి సంచారించు
దుడుకుబైరాగులదుమ్ము దులిపి
చాల గట్టా సూపు సంస్కృతాంభోజాక్షి
దిగులొంద చెవిగూబ పగులగొట్టి

# అ క్ష రా క్ష త లు

కవిత నాల్గవవాని గాఢసాంగత్యమ్ము
కనదన్న చట్టమున్ గాల దన్ని
అపవాదుపాలైన యంధవిశ్వాసాల
పూర్తిగా మట్టిలో పూడ్చివైచి

చదువుసంజ తెలుగజాలని వట్టియ
మాయకే ప్రజలకు మహితనిభృత
వజ్రశక్తి గలుగు ప్రతినిధివై చెడ్డ
నడ్డినావు పంటరెడ్డికులజ!

బిడియముతో సమాజమున బిచ్చపుజీవితముల్ పొనర్చుచున్
జడిసిన మానవావళికి జాగృతి గూర్పగ సత్కవిత్వపున్
అడిదము నెత్తి యుద్ధతులయాటలు గట్టినయట్టిజెట్టి నీ
యడుగులు పూజనీయములురా! తెలుగుంబ్రజకుం గయీసరా!

ఆటవెలదిలోన నా పిపీలికము బ్ర
హ్మమ్ముదాక కవన మల్లినావు
ఆటవెలది నీకు హారయోగ మిచ్చెనా?
దీర్ఘపూజ లగుత తెలుగుతబిసి!

శ్రీ

తెలివిడప్పినట్టి దీనమానవులకు
నీపదాలతోడునీడ చాలు
మూఢచిత్తములను పోవువారికి కొర
డాలు సుమ్మి నీపదాలు వేమ!

## రామానుజాచార్యులు

సమదృష్టిన్ వెలుపన్ సమాజము విశిష్టాద్వైతసిద్ధాంతమా
ర్గము జూపించినమానవోత్తముడ వార్యశ్రేణి నీపాదప
ద్మములన్ భక్తిని పూజలన్ సలుపు డంబంబింత లేనట్టి నీ
విమలోదారతకున్ నమస్కృతులు వేవేలౌత రామానుజా !

బెండుపోయెను వంచకుం డగు తొలియోజ్ఞ
ఘనయాదవప్రకాశునిమనమ్ము
పండిపోయెను క్రూరచండశాసను డగు
క్రిమికంఠు ఘోరమౌ కిల్బిషమ్ము
తొలగిపోయెను రాచకొలముపిల్లకు నిట్టి
స్పర్శతో బ్రహ్మరాక్షసునిబాధ
మురిసిపోయెను వల్లవులభామ ముక్తిధా
మము జేరగా ప్రసాదము భుజించి

## రామానుజాచార్యులు

నీదుకరుణచేత నీతపోబలసిద్ధి
వశ్యవాక్కుమంత్రబలముచేత
ప్రస్తుతింప దరమె? రామానుజాచార్య!
శ్రీపెరుంబుదూరు చిన్నవాడ!

నిను వింధ్యాటవిలోన జంపుటకు యత్నింపన్ గురూత్తంసు డ
ల్లన గోవిందు డెఱింగి యాగురునిలూలామాలముల్ నీకు జె
ప్పిన ప్రాణా లఱచేతబట్టి యెటులన్ విచ్చేసితో కంచి కో
య్యాన నీవల్లను నిల్చె నిచ్చట విశిష్టాద్వైత వేదాంతముల్.

అమలమా వేదవేదాంగముల్ పూర్తిగా
అమితదీక్షాసక్తి నభ్యసించి
జన్మపావనతకు సంప్రదాయమగు వై
ష్ణవభావతోయధిన్ స్నానమాడి
పరిపూర్ణభక్తితో ప్రణమిల్లి శ్రీకంచి
వరదరాజులవారి ప్రాపు నంది
చిత్తమ్ము మెఱయ కాంచీపూర్ణు లుపదేశ
సారసత్యమ్ముల సంగ్రహించి

## అక్షతాక్షతలు

యామునార్యుల కెపు డభివాదములు సల్పి
యనవరతము హరి నాత్మ దలచి
స్థిరమనస్వి యైన శ్రీశైలపూర్ణుల
నెత్రుపొత్తు నీకు నిండుజోత.

నీశిష్యుండు సదాశయుండు సరిగా నీవేషముం దాల్చి నీ
దా శిక్షన్ భరియించినా డది మహాత్మా! యెంతధన్యుండు కూ
రేశుం డెప్పటిమాట మాయెదలలో నీనాటికి న్నిల్చి యా
వేశమ్మున్ బురికొల్పి మౌనముగ నేర్పించున్ దనుత్యాగముల్.

సరవిన్ మంత్రబలమ్ము నేర్చుకొన నాశం జూపి సద్భక్తిమై
స్థిరసంకల్పబలుండు మంత్రముని గోష్ఠీపూర్ణులం గొల్చి పెన్
జరమశ్లోకము నేర్చుకొంటివి జగచ్చక్రమ్ము తోషింప నీ
తిరుమంత్రోచ్చరణమ్ము ముక్తిని బ్రసాదించెన్ బ్రజాకోటికిన్..

విమతులు పెట్టిన విషపుభిక్షాన్నమున్
కావేరిజలములో గలిపినావు
అంతమొందింపగా నర్చకబ్రువులెల్ల
కాలకూటవిషమ్ము గ్రోలినావు

## రామానుజాచార్యులు

పదిమంది బ్రతుకంగవలె నంచు గురునాజ్ఞ
    వినయమ్ముతో త్రోసి వేసినావు
సరియైనమార్గాన జనని శిష్యులను గ
    ద్దించి మేల్త్రోవ సూపించినావు

ఆలి యున్న యెడల నైహికబంధమ్ము
లూడ వనుచు నాలి వీడినావు
సన్యసించినావు పుణ్యాత్మ! వైష్ణవ
సంప్రదాయ శాస్త్ర శాసకుండ!

నీవాదమ్మున కోడి నీప్రతిభకున్ నీరాజనం బిచ్చి వి
ద్యావైశద్యము మెచ్చి పండితులు నద్వైతుల్ తలల్ వంచినా
రీవిశ్వంభర నీకు సద్బిరుదుగా శ్రీభాష్యపుం బేర సం
భావించెన్ వనమాలికోడలు జగన్మాన్యా! యశోమండనా!

ధీవిభవోన్నతాత్మ! యలస్త్రీలను శూద్రుల నుద్ధరింపగన్
ద్రావిడవేదముం జదివినాడ వదెక్కడి ప్రేమతత్త్వపుం
భావనమయ్యొ మానవత మాన్యత జెందెను నీకతాన నీ
కేవలజన్మ సార్థకత గిల్కెనె? కేశవయజ్వనందనా!

## అక్షరాక్షతలు

అవునులే కూరేశునర్ధాంగి యండాలు
నగలునస్త్రలు నరణ్యమున విడిచె
నిజములే నీకు సంత్యజులు డిల్లీదాక
తోడువచ్చినమాట నీడవోలె
సరియెలే హేమాంబ స్వార్థరాహిత్యము
వీక్షింపదలచి పరీక్ష నిడితి
అడియెలే వైష్ణవవ్యాప్తికై వ్యాసభ
ట్టరు పరాశరుల నిర్ధతి నునిచితి

విష్ణువర్ధనుండు విపులసాహాయ్యమ్ము
నందజేయు యాదవాచలమున
గుడుల గోపురాల గూర్చి నారాయణ
స్వామి తుష్టి జెంద సలిపినావు.

అనఘా! నీ వాకగాలిగోపురమ్ముపై నత్యంతదీక్షామహత్తున నారాయణమంత్రముం బ్రజల కుద్బోధించినావయ్య కూర్చొని నీవిశ్వజనీనదృష్టి కిది మార్పులేని సిద్ధాంతమై తనరెన్ జోతలు నీమహోన్నతసమత్వాదర్శనుశ్రీలకున్.

శివ

## రామానుజాచార్యులు

వర్ణబాహ్యు లైన పంచమజాతికి
నెమ్మి మీఱి వైష్ణవ మ్మొసంగి
సంస్కరించినట్టి స్వామి! రామానుజా
చార్యవర్య! శౌర్యకార్యధుర్య!

*

# తుంటరి

రసికునివోలె సత్కవిని రమ్మని యింటికిబిల్చి యింటిలో
మసలుచు నీవు లేనటుల మంత్రము పన్ని యసత్యవాక్కులన్
నిసుగులచేత పంపి కవినిన్ గికురించినవాడ వెందుకీ
నస యిది నీదుతుంటరితనమ్మున కొక్కప్రతీక యౌగదా !

పదిమందిన్ జమచేసి వాఙ్మయసభావ్యాజమ్మునన్ నీవు ప్రే
లెద వేదో రసహీనగేయముల నుల్లేఖించి నీడాబులో
కుదిరెన్ వర్ణము నీగులాములకు నీకుంజెల్లు నీమోసపున్
బ్రదుకుల్, సత్కవితాసుధారసము నాస్వాదింప సామాన్యమే !

నీకున్ వంశపరంపరాగతముగానే యబ్బె నీనేర్పు లా
యీకౌటిల్యప్రభావముల్ మధురసాహిత్యమ్ము సృష్టించువా
డేకాలమ్ముననైన పొందగలవాడే యాను మర్యాదలన్
నీ కిల్లాడితనమ్ము గూర్పదు రవంతేనిన్ యశోభాగ్యమున్.

జనతావందితుడైనదివ్యకవితా సామ్రాజ్యపట్టాభిషి
క్తునిపై నూరక లేనిపోనివి కుయుక్తుల్ పన్నిమూఢా! కుసంస్కారివై
మనుచున్నాడ వి దేమి, నీబ్రతుకు సంభావ్యమ్ము కాదోయి నీ
కును సాహిత్యము వర్తకమ్మయిన దుర్గంబాలతోపాటుగా.

కంఠంబెత్తి సరస్వతీమసృణవాగ్జాలమ్ము సత్సాహితీ
కంఠేకాలుడు విశ్వమానవతకై గానమ్ము సేయుంగదా!
కుంఠుల్ కుత్సితులున్ కులాలమనుజుల్ కోరాడుసంఘాన నో
శుంఠాగ్రేసర! నీకునున్ కవితతో సోబత్తు సంధిల్లునే?

ఎవడవునీవు నీరచన యెంత? యనర్గళదివ్యసాహితీ
ధవుడగు సత్కవీశ్వరునిధాటికి నీబిరు సెంత? పద్మసం
భవునిపడంతి కట్టు లవమానము గూర్చుట పాడిగాదు నీ
చివికినపాడుబుద్ధికి విశేషము లేపగిదిన్ బుగుల్కొనున్.

సకినంపుంబులుగా! అహో! హృదయసంస్కారమ్ము లేనట్టి నీ
వాకదద్దమ్మవు సాహితీజడుడవయ్యున్ నేటిలోకమ్మదిం
తకు మేధానిధిగాగ నిందలచెడిన్ ద్రవ్యోన్నతిం గాంచి యీ
మకిలంబైనజగత్తులో గలదె? ధర్మశ్రీకి సాఫల్యతల్.

# అక్షరాక్షతలు

లలితములైనశబ్దముల లాఘవశక్తిని గల్గు సత్కళా
విలసితు డాంధ్రసత్కవిని విజ్ఞత లేక విమూఢచిత్తమున్
పిలిచి యగౌరవించిన వివేకవిహీన! కవిత్వసృష్టిలో
నిలిచెద వీవు తుంటరిగ నీతివిహీనునిగా కిలాడిగా.

దేబెల్ నిన్ను రసజ్ఞశేఖరునిగా తెంపున్ ప్రలాపింప నీ
డాబుందర్పము లందుకోసమయి యోడ్డారించి గంగెద్దుగా
బాబయ్యల్ భజనమ్ములో మునుగు నీబ్రహ్మత్వముంగాంచినా
డో బొంకయ్య! కవీట్ఛిఖామణి! దురుద్యోగమ్ము వర్జింపుమీ.

నీకుహానారసజ్ఞతలు నీయవివేకపుబాసటల్ తమా
షాకబురుల్, శనిగ్రహపుఛాయలు నవ్వులలోనియుందముల్
లోక మెఱుంగు నీవు కడులోభివి వర్ణపుమద్యపాయి నీ
కా కవితాప్రసక్తి యవురా! యిదియొక్కడిమాట చెప్పగన్.

*

# ఆంజనేయా!

ఘను డిక్ష్వాకులరామచంద్రు డురుదుఃఖధ్వాంతవారాశిలో
మునుగన్ నీగురునాజ్ఞ నీజననిసమ్మోదమ్ము గైకొంచు స
ల్పినవీరోచితసాహసక్రియలకున్ విశ్వప్రపంచప్రజల్
నినుగొండాడెద రబ్రమాను హనుమా! నీజన్మరాహస్యముల్.

ఏమీ! కొండొకదూతగా వెడలి నీ విట్టే ధరాజాత సీ
తామాన్యైకమనోజ్ఞభావనమరందశ్రేణిలో దోగి హ
ర్షామోదాన వచించినావు రఘువంశాగ్రేసరుం డాత్మలో
ధీమాచెందగ నీమహోన్నతబలోత్సేకమ్ము శ్లాఘింపగన్.

సంజీవనీదివ్యశైలమ్ము పెకళించి
మొయిలుదారుల నీవు మోయునాడు
చిననాడు బాలభానుని గాంచి పం డని
యెంచి హుమ్మని మింటి కెగురునాడు

# అ క్ష రా క్ష త లు

వడముడి సీతశోకబట్టి లాగగ లేక
కొసకు క్షమాభిక్ష గోరునాడు
బహుదూర మైనట్టి వారాశి చిటికెలో
కీశాలి మెచ్చ లంఘించునాడు
నీయనంతశక్తి, నీయాత్మవిశ్వాస
మెంతద్రఢిమ గలదొ ? యివియ చాలు
బ్రహ్మచారి నీకు ద్వాపరాంతమ్మున
కెంతవయసు నుడువుమీ ! నిజాన.

ఈవుజనింపకున్న మఱి యెక్కడి దీరఘురామగాథ సు
గ్రీవునియాజ్ఞలో మెలగి కీరితి గంపలు నింపినాడ వీ
భూవలయమ్ములో జనులు పూజలు సేతురు నీయనుగ్రహ
శ్రీవిధికోసమై విజయచిహ్న ! ప్రభంజనవీరనందనా !

గిరిధరుడన్నశబ్ద మది కేవల మొక్కడు కృష్ణమూర్తికిన్
బిరుదము సంతసింతుము విసీతుడవై యచలశైలరాజమున్
కరమున మోసి యూర్మిళకు నాథునిప్రాణము నిల్పినట్టి నీ
చరితకు నాంజనేయ ! విలసన్నవమంజులగీతికాంజలుల్.

ఆంజనేయా!

సాంగోపాంగముగా నహస్కరునిశిష్యత్వమ్ములో నీవు మేల్
సంగీతమ్మును శాస్త్రవిద్యలను దీక్షారూఢిమై నేర్చి యు
త్తుంగాదర్శము రాముపుణ్యకథకున్ తూర్యధ్వనుల్ మ్రోగ జే
యంగాబూనిన నీయమోఘకృషి కయ్యా! దీర్ఘసంభావనల్.

*



9

# శరద్వేళ

జన్మతః ద్వేషమ్ము చాటింప కాబోలు
పగటిని గొట్టి రేబాలు హెచ్చె
ఉష్ణోగ్రతోద్వేగ ముడిగిపోయిన దంచు
కులికి నీహారమ్ము బలుపు సూపె
వలిపమ్ముపస జనావళికి ననిష్టమై
చనె నంచు వినుచు పచ్ఛదము పొంగె
రసరాగహీనవర్గాలకు వలరాజు
హేలగా ప్రేమపాఠాలు నేర్పె

నింగినవ్వులోన తొంగలించినయట్టి
ధవళకాంతిచయము తాండవమ్మ
విరిసినట్టి మల్లెవిరు లయ్యె వెన్నెల
వత్తు లయ్యె నీశరత్తులోన.

సామముదప్పి భీమమున సాగిననిర్ఝరు లాగడాలు నే
డేమియు గానిపించవు మహీవలయమ్మున వినూత్నవస్త్రముల్
దా మెయిదాల్చె నన్నటుల దాల్చెను స్నిగ్ధహిమాంశురాశి నీ
కామన యెట్టిదో తెలియగానగునే శరదంగనామణీ!

ఈదరగాలిలో తరుల నేలిన పిట్టలజంట లేకమై
మేదురమైనసౌఖ్యము లమేయముగా గొనుచుండ నింగిపై
రేదొర చల్లనైనకను తెప్పలనీడల క్రింద సౌఖ్యముల్
ప్రోది యొనర్చితో భువనముల్ పులకింపగ శారదాంగనా!

శ్రీకిని రాజ్యలక్ష్మికిని చిత్తము సూపుచు వైరివర్గముం
దాకగ నేగుచుందురు ముదమ్మున రాజులు చివ్వసేయ నీ
వాకులు తథ్యమై నిలుచు వాకబుచేసినచో మనోజ్ఞకా
ర్తీకపురంధ్రి! నీయుదయ రేఖలం దిక్తతి నిండువేళలో.

గిలిగింతల్ పులకించుటల్ హృదులలో గీల్కొన్న రాసిక్యపున్
వలపుల్ మోసులువారగా సలుపు దేవస్త్రీలు రంభోర్వశీ
జలజాక్షుల్ మదనాప్త బాంధవులు స్వచ్ఛంబైన నీకాంతిలో
పల సయ్యాటము లాడుకొందురె? మహాభ్రంబందు కార్తీకమా!

# అ క్ష రా క్ష త లు

ఆడుకొన్నారు మహాంధ్రావనీబాలు
రెలమి చెఱ్ఱాట నీ రేలయందు
పాడుకొన్నా రాంధ్రభామినుల్ జాతీయ
గేయాలు నీ రేలచాయలందు
నడుచుకొన్నా రాంధ్రనాథులు దండయా
త్రలకు నీ రేల వెన్నెలలలోన
నేర్చుకొన్నా రాంధ్రనిపుణులు నీ రేల
కాంతిలో వ్యూహాలగడుసుదనము

మానధనులును సుషమామధుమూర్తులు
తెలుగుపలుకుబడులు గలుగువార
లుచితమైన నీమహోదయ వేళలో
చిత్త మలర సంతసించినారు.

ఎంతటిదట్టినైన బిగియించినమానియు నీసుధాంశు స
త్కాంతులలోన కాస్త తిరుగాడిన, వానియమోఘమైనకొం
డంతతపమ్ము మాయమయి యంగనకోసము పర్వులెత్తకుం
డింతకు నూరుకోగలడె? యీరసదిగ్ధశరత్ప్రభానిశా.

# శరద్వేళ

తెలియనియుద్ధృతమ్ముగ నదీనదముల్ ప్రవహించి యూళ్ళపై
బలిసిననందివోలె పయిపైబడి సర్వము పోవునట్లుగా
సలిపెను కాలదర్పమున సన్నగ సన్నగ నంగనాచిగా
మలయుచునున్నదిప్పు డవి మందగతిన్ శరదిందిరామణీ!

చెట్టు చేమలు చిగిర్చినయంత పైనెక్కి
పరభృతమ్ములు పాటపాడునాడు
తీండ్రించి గ్రీష్మమ్ము చండ్రనిప్పుల రాల్చి
శిలలను బ్రద్దలు సేయునాడు
వఱదలై వేగాన వాహినీరూపాన
కట్టడమ్ముల కొల్లగొట్టునాడు
పుడమితల్లికి కాలమున సృష్టినిర్మాత
మంచుబువ్వను దినుపించునాడు

ప్రకృతికాంత విసిగి వికృతరూపము దాల్చి
అలిగి నలగి చెన్ను తొలగునాడు
నీమనోజ్ఞమైన నెఱివెన్నెలలవేళ
కాంక్ష సేయు నరుడు కార్తికమ్మ!

## అ క్ష రా క్ష త లు

తనమానసములోన కునికిపోయినకోర్కె
చివురింప నీలేఖ చేసె పూజ
వనభోజనముపేర వినుతించి యాతడు
భుజియించె కార్త్తికభోజనమ్మె
భువనాన నీత డభ్యుదయమ్మె పొందగ
వందించె ఘనశివానందలహరి
కృషికివచ్చిన పంట కెంతగానో చూచి
స్వాంతాన నీరైతు సంతసించె

సెనగ, పెసర, యులవ, మినుము, కంది పొలాల
కోరకాలు నేడు కుట్మలించి
నీమహోజ్జ్వలతకు నిక్కంపుచిహ్నాలు
గా వెలింగె దివ్యకార్త్తికమ్ము!

*

# గో రా

నీసంస్కార హృదంతరాళమునకున్ నివ్వాళు లర్పించె గాం
ధీసన్న్యాసి భవన్మహాశయములన్ వీక్షించి జహ్వార్ ప్రశం
సాసంభావన లందజేసెను జగన్మాన్యుండ వీవయ్య ని
న్నాసల్ దాకవు; గోపరాజుకులభూషా ! రామచంద్రాభిధా !

ఆస్తికవాదమందుగల యర్థరహస్యములన్ వచించుచా
దస్తుల మూర్ఖపద్ధతుల తార్కొని మానవతన్ భజించు నీ
మోస్తరు త్యాగులీభువనమున్ గనిపింతురు కోటికొక్కరై
ప్రస్తుతిగొంచు నీవిమలభావము ధాత్రికి పెన్నిధానముల్.

*

# అంకితము

ఒకభూసురాన్వవాయున
కొకకృతి నంకితము జేసి యుంటిని పస్తున్
తికమకబడి నిశియెల్లను
నికృష్టజీవితము దలచి నే నొకనాటన్.

ఇంకొక విప్రవతంసుం
డంకితముం గొని యుదారుడై కనుబరచెన్
అంకించుకూర్మిభావము
జం కింతయు లేక వర్ణజాడ్యము బెదరన్.

కలవా డని రసికత లవి
కలవా డని యొక్క రెడ్డిఘనునకు నొకమం
జులకృతి నిడ నాతడు మా
టలతో సరిపుచ్చుచును హుటాహుటి సనియెన్.

మఱియొకరెడ్డికి నాకృతి
సరసహృది నొసంగ నధికసమ్మోదముతో
పెరిమిని నతడు విశేషా
దరమును సూపించె సుకవితారసికుండై.

కులములగోలకు గన్నుల
గోలకుల బాష్పములు రాల్చుగుణుడగు కవితా
అలఘుండగు నొకరెడ్డికి
విలసితకృతి నీయ నతడు ప్రేమం జూచెన్.

తెనుగుందేశము నేలిన
ఘనుడగు నొకరెడ్డికులుని కరకంజములన్
ఉనిచితి నాకృతి నాతం
డొనరించెను లేతసాయ మొసపరిదృష్టిన్.

ఏదోతీరుగ సాయము
రాదా ? యని తలచుచు నొకరాజునకు కృతిన్
మోదాన నిచ్చినాడను
లే దింతకు కృతి కహహా ! ఫలిత మింతైనన్.

# అక్షరాక్షతలు

పొగడికల కాసజెందిన
దగారసికులకును వట్టి దద్దమ్మలకున్
తెగ నంకితా లొసంగిన
అగునే కృతిగన్నవాని కర్హంపుపూజల్.

ఇమ్ముగ నొకకృతి సాహి
త్యమ్మున పేర్గన్నవాని కర్పించితి వా
క్యమ్ముల పూజల నందితి
సొమ్ములకున్ దూర మౌచు శోకించితిపో.

మంతిరి యగు నొకనికి తెలి
వింతగలుగు ననుచు నొక్క కృతి నిచ్చితి తా
నింతకు రసహీనుం డని
అంతవఱకు తెలియలేక నాత్మ పొగిలితిన్.

కులజుం డగు హరిజనునకు
నలఘుకృతి నొసంగి యాత్మ హర్షించితి నా
వల నాతడు నీకులముల
తలపులలో దూరిపోయి ధర్మము దప్పెన్.

## అంకితము

ఏదోతంతుగ మాఱిన
దీద్దైన్యపుటంకితాలయిద్ధచిత్రల్
కాదేని రసికు డేడీ ?
వాదానికి గాక నుఱువ వాస్తవమునకున్.

కవితకు కులము ప్రధానము
కవితకు మార్బలము మంది గావలె నపుడే
కవి యెంతటివాడయినన్
అవురా ! ఆతనికవిత్వ మత్యద్భుతమా.

పస్తుల స్రుక్కినకవినిన్
శాస్త్ర కృతిని గొన్నవాడు గమనింపని యీ
మోస్తరుచేతలు కళలకు
సుస్తీ కలిగించి కవికి క్షోభం గూర్చున్.

అల్లుం డని తిక్కనకవి
యొల్లు మఱచి పిలిచె నెపుడో యొకరాజును నే
డల్లాటప్పయరసికుల
కిల్లైనది తెలుగునేల యెటజూచినచో.

# అ క్ష రా క్ష త లు

తుంటరిగాండ్రను కవనపు
పంటవలంతుల నొసంగి బాధపడెడు పెన్
దంటకయీసరులకు నే
తంటా లిక లేక కలుగుతన్ మేల్సుఖతల్!

*

## లెనిన్

ఈవు సమస్తవిశ్వమునకే నిజమ్మాడగ మార్గదర్శివై
నావు కృశించు కార్మికజనమ్ముల ఊపిరివోసి స్వేచ్ఛపున్
దావులు వీవ జేసితివి నవ్యసమాజము సృష్టి జేయ గాం
డీవియు కృష్ణుడున్ జగతి నీకుసమానులుగారు "వ్లాదిమిర్".

నీడకు తావులేని ధరణింగలకార్మికులెల్ల దాస్యపున్
గాఢతమస్సులో కునికి కాలముబుచ్చుచునున్న వేళ ను
ద్గాఢప్రతిజ్ఞ బూని భయదం బగు జారుప్రభుత్వపాలనా
రూఢపిశాచిదంష్ట్రికల డుల్లగ జేసితి వెంతవాడవో !

కర్మవీరుల నెత్తుర్రు కడుపార జుర్రిన
జారుభూపులగుండె జాఱిపోవ
సకలరష్యాజనస్వాంతాల ద్వేషాలు
తలయెత్తి మట్టిలో గలిసిపోవ

## అ క్ష రా క్ష త లు

పోతరించినయట్టి భూస్వాము లెల్లరు
దుఃఖింప సుఖములు తొలగిపోవ
ఎదురాడుశత్రువాహిని తనయంతగా
ఎక్కడకక్కడే యింకిపోవ

విప్లవాత్మతోడ విశ్వమ్ము కదలాడ
హుంకరించి నవనవోజ్జ్వలంపు
నవసమాజ మవని యవతరింపగ లెనిన్
నీదుజీవితమ్ము నిలిపినావు.

*

# స్మృతి

తిరుగునా యీనాడు దరహాస మొలికించి
సరసాంధ్రమధుర భాషాలతాంగి
కురియునా యీనాడు వరకవీంద్రుల హృద
బ్జవనీస్థలమ్మున పసిడివాన
జరుగునా యీనాడు సాహిత్యగోష్ఠులు
కొలువుకూటమున వెన్నెలలు కాయ
మురియునా యీనాడు మూఁడుపూటలు పూజ
లింపార గని కుక్కుటేశ్వరుండు

పరిమళములుసిమ్మ ప్రసవాలు పూయునా ?
రావువంశతిలక ! రాజచంద్ర !
మీ యశస్సు నిలిచిపోయిన గడ్డకున్
కోటి కోటి కోట్ల వేఁటికోళ్ళు.

BCI

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No

AOUA105B139

BC

జ్ఞా నా నం ద క వి,
తెలుగుపండితులు,
మెక్లారిన్ హైస్కూలు,
కా కి నా డ.

# మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తక సంఖ్య | AOUA1056139 |
| పుస్తకం పేరు | అక్షరాక్షతలు |
| తేదీ | 31 December 2025 |
| ముందు అట్ట | Yes |
| వెనుక అట్ట | Yes |
| మొత్తం పేజీలు | 108 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | [illegible] |
| లేని పేజీలు | nil |
| తయారు చేసినది | kethira |
| పేజీలు విడదీసినది | kethira |
| స్కాన్ చేసినది | Teja |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |